పాలిసెట్‌లో గుడిపాడు విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - దువ్వూరు

శనివారం విడుదలైన పాలిటెక్నిక్ ఫలితాల్లో గుడిపాడు శ్రీశంకరాచార్య విద్యా మందిర హై స్కూల్ విజయ దుందుభి మోగించింది. గుడిపాడు గ్రామానికి చెందిన వరికూటి రమణారెడ్డి కుమారుడు వరికూటి శ్రీశాంత్‌రెడ్డి 120కి 119 మార్కులు సాధించి రాష్ట్రంలో 37వ ర్యాంక్ సాధించినట్లు శ్రీ శంకరాచార్య విద్యా మందిర్ కరస్పాండెంట్ మూలే రామమోహన్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు ఆయన హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని పలువురు మేధావులు, రాజకీయ నాయకులు అభినందనలు తెలిపారు. శ్రీశాంత్‌రెడ్డి జెవివి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో మండల, జిల్లా ఫస్ట్, కేంద్ర ప్రభుత్వ వివిధ పరీక్షల్లో జిల్లా ఫస్ట్, స్టేట్‌లో మూడవ స్థానం, ఎస్‌ఎస్‌సి 2023 ఫలితాల్లో 600కు 586, పాలీసెట్ 2023లో జిల్లా 1ఫస్ట్, స్టేట్ 37 ర్యాంకు సాధించాడు.

అలవెన్సులకూ..ఆంక్షలు!

పేరుకే రూ.23 పెంపు..ఆచరణలో మెలిక

ప్రతి కూలీపై సరాసరి రూ.60 తెగ్గోత

ప్రస్తుతం కూలి రూ.200లే..

కేంద్రంలోని బిజెపిప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ఉద్దేశ పూర్వకంగా నిర్వీర్యం చేస్తోంది. ప్రతియేటా బడ్జెట్ కుదింపు దగ్గర నుంచి డిమాండ్ పేరుతో కూలీలకు ఉపాధి పనుల కోత, రూ.23 అరకొర అలవెన్స్‌కు ఐదు గంటలు పని చేయాలనే ఆంక్షలు విధించడం, కొరమట్ల కొరత వరకు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తోంది. ఈలెక్కన రూ.60 మేర అలవెన్స్‌ను కుదించినట్లు లెక్కలు చెబుతుండడం గమనార్హం. దీనికితోడు ఈయేడాది నుంచి ఎన్‌ఎంఎస్ సాఫ్ట్ వేర్‌ను రూప కల్పన చేసి రాష్ట్రప్రభుత్వ పరిధిలోని ఉపాధి హామీ వ్యవహారాల్ని తన గుప్పిట్లోకి తీసుకుంది. ఇప్పటివరకు రాష్ట్రప్రభు త్వాలు ఉపాధి కూలీ లకు కల్పిస్తున్న సదుపాయాలపై దాడి చేయడం మొదలుపెట్టింది. కేంద్రప్రభుత్వ ఇటీవలి విన్యాసాల కారణంగా ఉపాధికూలీల నోట్లోకి ఐదు వేళ్లను అమాంతంగా వెనక్కి లాగేయనుం డడం ఆందోళన కలి గిస్తోంది.

ప్రజాశక్తి - కడపప్రతినిధి

జిల్లాలోని పెండ్లిమర్రి మండలంలోని 19 పంచాయతీల్లో 73 ప్రదేశాల్లో ఉపాధి హామీ పనులు చేపట్టారు. ఇందులోభాగంగా శని వారం 4,100 మంది ఉపాధి పనులకు హాజరయ్యారు. కేంద్రంలోని బిజెపి సర్కారు ఉపాధి పనుల్లో పారదర్శకత పేరుతో తెచ్చిన ఎన్ ఎంఎస్ సాఫ్ట్‌వేర్ కింద డిమాండ్ పొందిన ఉపాధి కూలీలు వారం లో నాలుగు రోజులు పనులకు హాజరై మిగిలిన మూడు రోజులు వెళ్లకపోతే వారం రోజులను ఉపాధి కల్పించినట్లు జమ చేస్తోంది. ఫలితంగా డిమాండ్ పొందిన కూలీలు మూడు రోజుల ఉపాధిని వదులుకోవాల్సిన దుస్థితి దాపురించింది.

కోతలే..కోతలు

ఇటీవల ఉపాధి కూలి ప్రదేశాల్లో కూలీల సంరక్షణకు ఉద్దే శించిన సదుపాయాలను తుంగలో తొక్కింది. ఫలితంగా ఉపాధి కూలీలకు రూ.60 వరకు అలవెన్స్‌ను ఉపసంహరించుకుంది. ఫలి తంగా పెండ్లిమర్రి మండలంలోనే ఒక్కరోజుకు సంబంధించి రూ. 2.46 లక్షలు నష్టపోతున్నట్లు తేలుతోంది. వాటి వివరాలను పరి శీలిస్తే గతంలో ఉపాధి కూలీలు రూ.30 వేసవి అలవెన్స్, మేట్ అల వెన్స్ రూ.20, తాగునీటికి రూ. ఐదు, గడ్డపారకు రూ.ఐదు, తట్టా బుట్టకు రూ.ఐదు, మజ్జిగకు రూ.ఐదు, ఆటో ఛార్జీలకు రూ.20 చొప్పున చెల్లించడం తెలిసిందే. ఇందులో ఆటోఛార్జీలను మినహా యిస్తే వేసవి అలవెన్స్‌ను రూ.23 ఇస్తున్నట్లు చెబుతూ, ఐదు గంటల పాటు పని చేస్తేనే ఇస్తామని మెలిక పెట్టింది. ఎటు వంటి సదు పాయాలు లేని పనిప్రదేశాల్లో ఐదు గంటలు పని చేయడం సాధ్యం కావడం లేదు. ఫలితంగా వేసవి అలవెన్స్ పొందే అవకాశం లేకు ండా పోయిందనే వాదన వినిపిస్తోంది. తాగునీటికి, మజ్జి గకు, గడ్డ పారకు, తట్టాబుట్టకు ఐదేసి రూపాయల చొప్పున ఇవ్వాల్సిన అల వెన్స్‌కు తుంగలో తొక్కింది.

వసతుల కల్పన ఒట్టిమాటే

ఉపాధి ప్రదేశాల్లో వసతుల కల్పన ఒట్టి భ్రమను తలపిస్తోంది. 2014లో ఇచ్చిన టెంట్లు, కొరముట్లు మరమ్మతులకు గురవడం, మరమ్మతులకు ఒక్క రూపాయిని విడుదల చేయక పోవడం, వస తుల కల్పన పర్యవేక్షించే మేట్లను తొలగించడం వంటి పనులతో ఉపాధి హామీ పథకం నిర్వీర్యమవుతోంది. దీనికి తోడు ఉపాధి కూలీ లకు సంరక్షనకు ఉద్దేశించిన మెడికల్ కిట్ దగ్గర నుంచి తాగునీరు, మజ్జిగ, గాయాల బారిన పడిన వారికి రూ.2,000 నుంచి రూ.50, 000 వరకు చెల్లించే పరిస్థితులకు కాలం తీరిపోయిందనే వాదన వినిపిస్తోంది.

కూలి అరకొరే!

2014 నుంచి కూలి పెరుగుదలకు నోచుకోవడం లేదు. 2014లో ఉపాధి కూలి రూ.272 ఉండగా, పదేళ్ల అనంతరం రూ. 272 ఉండడం గమనార్హం. ఏటా 15 శాతంపైగా ధరలు పెరుగు తున్న నేపథ్యంలో ఉపాధి కూలి రూ.600 పెరగాల్సి ఉంది. వాస్త వంలో సగటు కూలిని పరిశీలిస్తే రూ.254 మించి పడడం లేదని తెలుస్తోంది. నేలల్లో హార్డ్‌కోర్ పడడం, పనుల పరిమాణంలోని గుం తల లోతు, పొడవు పరిమాణాలను పెంచడం వంటి కారణాల రీత్యా కూలికి రూ.200 పరిమితమైంది. దీనికితోడు గ్రామాల నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో పనులు కల్పించడం పరిపాటిగా మారింది. పనుల ప్రదేశాలకు వెళ్లడానికి ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఆటో రాకపోకలకు రూ.20 చెల్లింపులను కలిపితే రూ.220 మించి పడడం లేదని తెలుస్తోంది. ఈలెక్కన ప్రతి ఉపాధి కూలి సుమారు రూ.60 వరకు కోల్పోవాల్సి రావడం విస్మయాన్ని కలిగిస్తోంది.

వసతి సదుపాయాలు కల్పించాలి

మండుటెండల్లో ఉపాధి పనులు చేయడం కష్టంగా ఉంది. కనీస వసతి సదుపాయాలైన టెంట్లు, తాగునీరు, మజ్జిగ, ప్రాణాధార ఔషదాలను అందుబాటులో ఉంచాలి. వేసవిలో ఎండ తాకిడికి గురై తే తమ కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉంటుందని గ్రహిం చాలి.

పార్నపల్లి, రామసుబ్బమ్మ, కొత్తపల్లి, పెండ్లిమర్రి.

అలవెన్స్ షరతులు దారుణం

వేసవి అలవెన్స్‌ను కుదించడం దారుణం. మండుటెండల్లో ఐదు గంటలు పని చేస్తేనే అలవెన్స్ వర్తింపు చేస్తామనడం తగదు. ఇటువంటి పరిస్థితుల్లో తమకు ఇవ్వాల్సిన అలవెన్స్, కూలిపై షర తులు విధించడం అన్యాయం. విధిలేని పరిస్థితుల్లో చేస్తున్న మనుగడ కోసం చేస్తున్న కష్టాన్ని గుర్తించాలి.

నరసింహకుమార్‌రెడ్డి, యాదవాపురం, పెండ్లిమర్రి,

కూలి పెంచే వరకు పోరు

రూ.600 కూలి పెంచే వరకు పోరాటం చేస్తాం. పదేళ్ల నుంచి రూ.272 మించి పెంచకపోవడం దారుణం. ప్రతియేటా పెరుగు తున్న ధరల పరిమాణం మేరకు పెంపుదల ఉండాలి. వేసవి సీజన్ లో పదెకరాలు పొలం కలిగిన రైతులూ ఉపాధి పనులకు హాజరవు తున్న నేపథ్యంలో ఉపాధి పనులూ పెరగాలి, కూలి రేటును పెం చాల్సి ఉంది.

అన్వేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, కడప.

ఎస్‌హెచ్‌జిలను మరింత బలోపేతం చేయాలి

- కలెక్టర్ వి.విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్ రామరాజు

జిల్లాలో పేదరిక నిర్మూలన, అభివృద్ధి, సాధికారితకు ఆయువు పట్టు అయిన స్వయం సహాయక సంఘాల బలోపేతానికి డిఆర్‌డిఎ, మెప్మా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ వి. విజయ్ రామరాజు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ విసి హాలులో డిఆర్‌డిఎ, మెప్మా పరిధిలో జిల్లాలోని గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వివిధ రకాల పనుల పురోగతిపై డిఆర్‌డిఎ, మెప్మా పీడీలు ఆనంద్‌నాయక్, వై. సురేష్‌రెడ్డి, కృష్ణయ్యతో కలసి క్షేత్రస్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. 'పేదలందరికీ ఇళ్లు' గృహ నిర్మాణ పథకంలో భాగంగా స్వయం సహా యక సంఘాలకు బ్యాంకుల ద్వారా అందించే రూ.35 వేల రుణ సాయాన్ని లబ్ధిదారులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అమూల్ కంపెనీ భాగ స్వామితో ముందుకు సాగుతున్న జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నడిపించాలని చెప్పారు. జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాలతో పాటు వికలాంగులు, వృద్ధాప్య, ఎఫ్‌పిఒ రాగ్ పికర్స్, చిరు వ్యాపారుల గ్రూపులను ఏర్పాటు చేస వారి జీవన ప్రమాణాలను, ఆర్థిక స్థితిని మెరుగు పరచాలన్నారు. డిఆర్‌డిఎ పరిధిలో మండలాల్లోనూ చిరు వ్యాపారులకు స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి పిఎం స్వనిధి, జగనన్న తోడు పథకాలతో పాటు వ్యాపారాభివృద్ధి కోసం గ్రూపుల వారీగా రుణ సదుపాయం కల్పించాలన్నారు. సభ్యులందరికీ పెన్షన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, నివాస గృహాలు అందుతున్నాయా లేదా అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు రాగ్ పికర్స్ (పాత దుస్తులు, చిత్తు కాగితాలు ఏరుకునే వారు) కూడా ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించి గ్రూపులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ గ్రూప్ ఫార్మేషన్, ఫైనాన్సింగ్, గ్రౌండింగ్, బుక్ కీపింగ్ మొదలైన ప్రక్రియలను క్రమం తప్పకుండా పర్యవేక్షి ంచాలన్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ డిపిఎంలు, ఎపిడిలు, మెప్మా సిఎంఎంలు, సెర్ఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రం బాగుపడాలంటే 'బాబు' సిఎం కావాల్సిందే

జిల్లాలో యువగళం విజయవంతం చేయాలి

మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో సర్వనాశనం అయిన ఆంధ్ర రాష్ట్రం బాగుపడాలంటే, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిందే అని టిడిపి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. దేవుని కడప రోడ్డులోని రహమతీయ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఎన్టీఆర్ శతజయంతి, జిల్లా మినీ మహానాడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పట్లో లక్ష్మీపార్వతి నుంచి పార్టీని కాపాడుకోకపోతే ప్రస్తుతం ఎన్టీఆర్ శత జయంతి ఉండేది కాదన్నారు. ప్రపంచ దేశాలలో ఎన్టీఆర్ శత జయంతి వేడుకలను నిర్వహించడం తెలుగు ప్రజలు గర్వించదగ్గ విషయమన్నారు. నెల్లూరులో సారా నిషేధానికి అఖిలపక్షంతో కలిసి పోరాటం చేస్తే, ఎన్టీఆర్ వచ్చి తనను అభినందించి నిషేదిస్తామని చెప్పి, అధికారంలోకి రాగానే మధ్య నిషేధం చేశారని చెప్పారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే దశలవారీగా మధ్య నిషేధం చేశారా అని ప్రశ్నించారు. రైతు సంక్షేమం కోసం ఏడాదికి రూ.50 తో ఉచిత విద్యుత్తును అందించిన ఘనత ఎన్టీఆర్‌దే అన్నారు. వైసిపి ఎంపీ అవినాష్ రెడ్డికి షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ బినామీగా ఒక ట్రాన్స్‌ఫార్మర్ రూ. 4. 8 లక్షల బిల్లులు చెల్లింపు చేసుకుంటున్నారని విమర్శించారు. వై ఎస్ వివేకానంద రెడ్డి హత్యలో సంబంధం ఉన్న అవినాష్ రెడ్డి బయట తిరుగుతుంటే, ఆయన తండ్రి భాస్కర్ రెడ్డి లోపల ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన కలిస్తే 165 సీట్లు ఖాయమన్నారు. జగన్ రెడ్డి పాలనపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, ఆ వ్యతిరేకత పులివెందులలో కూడా ఉందని మాజీ ఎమ్మెల్సే బిటెక్ రవి పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులు మల్లెల లింగారెడ్డి మాట్లాడుతూ ఈనెల 23న యువ గళం నారా లోకేష్ పాదయాత్ర జిల్లాలో కొనసాగుతుందని, ఏ నియోజకవర్గంలో పాదయాత్ర కొనసాగినా జిల్లా వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్న నాయకులను, కార్యకర్తలను సోమిరెడ్డి దృశ్యాలవాలతో వేదికపై ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పార్థసారథి రెడ్డి, మహిళా నాయకులు లక్ష్మి ప్రసన్న, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్, హరి ప్రసాద్, జిల్లా వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సమ స్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ వ్యవ స్థాపకులు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట వికలా ంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వికలాంగులకు రూ.6వేలు పింఛను పెంచాలని కోరారు. కొత్తగా ఏర్పడి జిల్లాల్లో వెంటనే వికలా ంగుల సంక్షేమ శాఖ కార్యాల యా లను ఏర్పాటు చేయాలని తెలిపారు. భార్యా భర్తలు ఇద్దరూ వికలాంగులు అయితే ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. చదువు లేని వారు అయితే రూ. 5 లక్షల రుణ సదు పాయం కల్పించాలని వికలాంగులకు తొల గించిన పింఛన్లు వెంటనే మంజూరు చేయా లన్నారు. వికలాంగులకు అంత్యోదయ కార్డు మంజూరు చేసి 35 కేజీల బియ్యం వెంటనే ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వివాహం చేసు కున్న వికలాంగుడు చనిపోతే ఆ కుటుంబాన్ని రూ. ఐదు లక్షల బీమా సౌకర్యం అందించాలని కోరారు. వికలాంగుల పేరు మీద ఉన్న ఇంటికి ఉచిత విద్యుత్తు, కుళాయి పన్ను రద్దు చేయాలని తెలిపారు. బ్యాక్ లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, చట్ట సభల్లో రాజకీయ రిజర్వేషన్ 4 శాతం కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వికలాంగుల రాష్ట్ర అధ్య క్షులు అన్నం చిన్న సుబ్బయ్య యాదవ్, కార్యదర్శి సుబ్బారావు, జిల్లా అధ్యక్షులు మాతయ్య, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు రెడ్డయ్య, మహిళా అధ్యక్షురాలు లలిత, నగర అధ్యక్షులు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి నాగయ్య, అంజి, రంగారెడ్డి, నర్సారెడ్డి, నారా యణమ్మ, గంగాధర్, సుబ్బరాయుడు, ఓబయ్య పాల్గొన్నారు.

రాష్ట్రానికి బిజెపి ఒక శని గ్రహం : పిసిసి

పోరుమామిళ్ల : రాష్ట్రానికి బిజెపి ఒక శని గ్రహం లా, టిడిపి, వైసిపి రాహు కేతువులుగా దా పురించాయని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి విమ ర్శించారు. శనివారం మాజీ ఎమ్మెల్యే కమలమ్మ స్వగృహంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని వాపోయారు. రాష్ట్రానికి సంజీవని లాంటి ప్రత్యేకహోదాకు పంగనామాలు పెట్టిందని తెలిపారు. కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్‌కు స్వస్తి పలికిందన్నారు. దుగ్గరాజపట్నం ఓడరేవు ఊసే లేదన్నారు. ఆంధ్రుల ఆత్మాభిమానికి ప్రతీక అయిన విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ను అమ్మకానికి పెడుతుం దన్నారు ఆంధ్ర బ్యాంకును కాలగర్భంలో కలిపేసిందని తెలిపారు. బిజెపి దేశాన్ని అప్పుల భారత్ చేసిందన్నారు. బిజెపి దేశాన్ని అమ్మకానికి పెట్టిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను, విమానాశ్రయాలను, నౌకాశ్రయాలను, రైల్వేస్టేషను అమ్మేస్తుం దన్నారు. నిరుద్యోగం రోజురోజుకూ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎపిసిసి వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్, ఎపిసిసి డెలిగేట్ అన్వర్, పోరుమామిళ్ల మండల అధ్యక్షులు, బయపురెడ్డి, కాంగ్రెస్ నాయకులు ముక్తియార్, బాల గుర్రయ్య, సయ్యద్ పాల్గొన్నారు .

పౌష్టికాహారం పంపిణీ

కలసపాడు : మండలంలోని చెన్నారెడ్డిపల్లె అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు కార్యకర్త విజయమ్మ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెనుప్రకారం పౌష్టికాహారాన్ని అందజేస్తున్నామని తెలిపారు. సున్నా నుంచి మూడేళ్లలోపు పిల్లలను, తల్లిదండ్రులు లేదని అనాథ పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలన్నారు. మిషన్ వాత్సల్య కింద అనాథ పిల్లలకు రూ. 4 వేలు ప్రభుత్వం నుంచి మంజూరవుతుందని చెప్పారు. కార్యక్రమంలో గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విడిది

పోరుమామిళ్ల : స్థానిక గ్రంథాలయంలో ఈనెల 8 నుంచి ప్రారంభమైన ఉత్సాహంగా కొనసాగుతోందని గ్రంథాలయాధికారి అఫ్రిద్, జెవివి జిల్లా కార్యవర్గ సభ్యులు దాదాపీర్ పేర్కొన్నారు. శనివారం విద్యార్థులకు చదరంగం, లుడో, బిజినెస్ మెన్, కథల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన మోక్షిత, ఆలియా, అమన్ తదితర విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులలో ఉత్సాహాన్ని నింపేందుకు, వారిలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రతి వారమూ వివిధ రకాల పోటీలు నిర్వహించి దాతల సహకారంతో బహు మతులు అందజేస్తున్నామన్నారు. విద్యార్థులు సమ్మర్ క్యాంపులో పాల్గొని వినోదంతో పాటు విజ్ఞాన వంతులు కావాలని వారు కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

చిన్నారులందరికీ ఆధార్ తప్పనిసరి

కలసపాడు : మండలంలోని అంగన్వాడీ కేంద్రంలో ఉన్న 0 నుంచి 6 సంవత్సరాల లోపు చిన్నారి పిల్లలందరికీ ఆధార్ తప్పనిసరి అని అంగన్వాడీ సూపర్‌వైజర్ రత్నకుమారి పేర్కొన్నారు. శనివారం పిడుగుపల్లె అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన అంగన్వాడీ కార్యకర్తల సమావేశంలో ఆమె హాజరై మాట్లాడారు. సంవత్సరంలోపు పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాన్ని ఆయా హాస్పిటల్ నుంచి పొందిన తర్వాత సచివాలయ ఆధార్ కేంద్రాలలో నమోదు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

కడప అర్బన్ : నగరంలోని రవీంద్ర నగర్ లో ఉన్న జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో ఈనెల 1నుంచి 20 వరకు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాన్ని అధిక ఎండల వల్ల ముగించామని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మొదటి ముఖ్యమంత్రి ,ఆంధ్రకేసరి టంగుటూరి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. హ్యాండ్ రైటింగ్, క్రాఫ్ట్, మ్యాజిక్, పాటలు, కథలు, తెలుగు వ్యాకరణం, యోగా, వేదిక్ మ్యాథ్స్, డ్యాన్స్ లాంటి వివిధ అంశాల ద్వారా విజ్ఞానంతో కూడిన వినోదాన్ని అందించామని తెలిపారు. ప్రతి అంశము నుంచి మంచి ప్రావీణ్యం ప్రదర్శించిన కొందరిని ఎన్నికచేసి మెడల్స్, పుస్తకాలను బహుకరించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఏ.డి.దేవదత్తం, ఉపాధ్యక్షులు రాయల్ కరిముల్లా, సమత నాయకురాలు కామేశ్వరమ్మ, నగర కమిటీ యూత్ నాయకులు మధు, రిసోర్స్ పర్సన్స్ చంద్రకళ, స్వర్ణలత పాల్గొన్నారు.

బాపట్ల ఎడ్లకు మొదటి బహుమతి

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురంలో ఆర్మీ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్ల ఎడ్ల బండలాగు పోటీలలో బాపట్ల జిల్లా వీరాస్వామికి చెందిన ఎద్దులు మొదటి బహుమతి రూ. లక్ష గెలుచుకున్నాయి. మొత్తం 8 కాండ్ల ఎద్దులు పాల్గొన్నాయి. ప్రతి ఎడ్ల యజ మానులకు ఆర్మీ సిబ్బంది శాలువాలు కప్పి సన్మానించారు. వచ్చిన భక్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు.

ప్రయివేట్ అధ్యాపకులపై ఒత్తిడి ఆపాలి

కడప అర్బన్ : ప్రయివేట్ విద్యా సంస్థలు అడ్మిషన్ల కోసం ఉపా ధ్యాయులను ప్రచారాలకు తిప్పడాన్ని విరమించుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం.చిన్ని డిమాండ్ చేశారు. శనివారం పాత బస్టాండ్‌లోని జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ తీవ్ర స్థాయిలో ఎండలు ఉన్నాయని పేర్కొన్నారు.ఈ సమయంలో బయటకు రావాలంటేనే భయపడుతున్న క్షణంలో ప్రయివేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు, విద్యా సంస్థలు ప్రచారం కోసం ఊరూరూ, వీధి, వీధులు తిప్పుతూ ప్రచారం చేయిస్తున్నారని చెప్పారు. రాకుంటే తర్వాత విద్యా సంవత్సరం తిరిగి తీసుకోమని బెదిరి స్తున్నారన్నారు. ఉపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చే యాజ మాన్యాలపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళన నిర్వహి స్తామని హెచ్చరించారు. సమావేశంలో నగర ఉపాధ్యక్షులు విజయ్, వంశీ పాల్గొన్నారు.

నోట్ల రద్దు మోడీ చేతకానితనమే



మాట్లాడుతున్న బడి జకరయ్య

కడప : నోట్ల రద్దు మోడీ చేతకానిత నమని ఎఐ సిసి సభ్యులు బండి జకరయ్య, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి సత్తార్ అన్నా రు. శనివారం స్థాని క కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2016 నవంబరు 8వ తేదీ రాత్రి 8 గంటలకు చావు కబురు చల్లగా చెప్పినట్లు ప్రధాని నరేంద్ర మోడీ నోట్ల రద్దు నిర్ణయాన్ని ప్రక టిం చారన్నారు. ఈ నిర్ణయాన్ని 'స్వచ్ఛత అభియాన్' వర్ణిం చారు అని తెలిపారు. ఇది దరిద్రపు అభియాన్ అయిందని విమ ర్శించారు. రూ. 2 వేల నోట్లతో తమ నల్ల కుబేరులకు నల్ల సంపద అంతా సర్దుబాటు చేసుకున్నాక ఇప్పుడు ఆ నోటును నోట్ల రద్దు అంటున్నారు అన్నారు. మీడియా సమా వేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌గౌడ్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై అవగాహన

కడప : అక్రమ రవాణాపై మహిళలు అవగాహన కలిగి జాగ్రత్తలు తీసుకోవాలని దిశా పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీదేవి, మురళీమోహన్ సూచించారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ(స్టెప్) ఆధ్వర్యంలో భారత్ మహిళల ఇంజి నీరింగ్ కళాశాలలో 'మహిళల అక్రమ రవాణా, దిశా యాప్''పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఎన్ని చట్టాలొచ్చినా ఇప్పటికీ చాలా దేశాల్లో మనుషుల అక్రమ రవాణా సాగుతూనే ఉంది అన్నారు. మహిళలు ఇటువంటి వాటి గురించి అవగాహనా కలిగి జాగ్రతలు తీసుకోవాలన్నారు. దిశా వన్ స్టాప్ అడ్మి నిస్ట్రేటర్ అశ్వని మాట్లాడుతూ చట్టాల గురించి మహిళలకు అవగాహనా కల్పించడం ఎంతైనా అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో విద్యార్థినులు పాల్గొన్నారు.

వార్డులు మార్చడం సరికాదు : సిఐటియు

కడప అర్బన్ : కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికులను ఎలాంటి కారణం లేకుండా వార్డులు మార్చడం సరికాదని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి సుబ్బయ్య అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థ కమిషనర్‌కు అనేకసార్లు వినతి పత్రాల ద్వారా కార్మికులను సెక్రెటరీ లు వేధిస్తున్నారని, వారి ఆగడాలు మితి మీరి పోయని తెలియజేశామన్నారు. సచివాలయలలో ఇష్టారాజ్యం నడుస్తుందని చెప్పారు. శానిటేషన్ సిబ్బంది ని వార్డు మార్చాలి అంటే ఒక విధి విధానం లేకుండా సెక్రెటరీ లు కమిషనర్ పేరు చెప్పి బెదిరింపు దోరణిలో కార్మికులను వార్డులు మారుస్తున్నారని పేర్కొన్నారు. ఆఖరికి డిప్యూటీ మే యర్ భర్త కూడా జోక్యం చేసుకుంటున్నారని విమర్శి ంచారు. కమిషనర్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే



మాట్లాడుతున్న చీకటి చార్లెస్

కడప : కాంగ్రెస్ పార్టీ యువనేత రా హుల్ గాంధీ ప్రభ ంజనంతో కేం ద్రంలో రాబో యేది కాంగ్రెస్ ప్రభు త్వమేనని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ అన్నారు. శనివారం నగరంలోని ఆపార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో నడుస్తున్న బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధా నాలను అవలంబిస్తూ దేశాన్ని నాశనం చేస్తోందని ఆరో పించారు. రాహుల్ గాంధీ జోడో యాత్ర ప్రభంజనమే నేడు కర్నాటక గెలుపు అన్నారు. అన్ని రాష్ట్రాలలో అన్ని అసెంబ్లీలు, వచ్చే పార్లమెంటు ఎలక్షన్లో కూడా అన్ని పార్లమెంటు స్థానాలను కూడా కైవసం చేసుకుని 2024 లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టిస్తుంచ బోతోందన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శులు పెనుబాల ఓబులేసు, గంగాధర్ పాల్గొన్నారు.

సీజ్ చేసిన క్లినిక్‌ను పరిశీలించిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని అంగడి వీధిలో ఉన్న ఆర్‌ఎంపి డాక్టరు బివియన్ బాబు క్లినిక్‌ను సికె దిన్నె పిహెచ్‌ఒ డాక్టర్ రాఘవేంద్ర అడిషనల్ డీఎంహెచ్ఒ ఉమామ హేశ్వరరావు శుక్రవారం సీజ్ చేసిన విషయం తెలిసిందే. శనివారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వెంకటకృష్ణ మాధవి బాబు క్లినిక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ చింతకొమ్మదిన్నె మెడికల్ ఆఫీసర్ రాఘవేంద్ర ఫిర్యాదు మేరకు అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ ఉమా మహేశ్వరరావు ఆదేశాలను మేరకు క్లినిక్‌లో పంచనామా నిర్వహించామన్నారు. మందుల అధికారులను స్వాధీనం చేసుకుని తర్వాత డాక్టర్ రాఘవేంద్ర బాబు క్లినిక్‌ను సీజ్ చేశామని చెప్పారు. కార్యక్రమంలో సిహెచ్ఒ సుకుమార్, ఎఎన్ఎం సిసింద్రీ, ఆశా వర్కర్ శివ రంగమ్మ పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి : సిడిపిఒ

బాలుడితో మాట్లాడుతున్న సిడిపిఒ

కడప అర్బన్ : బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని సిడిపిఒ శోభారాణి అన్నారు. శనివారం దేవుని కడపలో ఐసిడిఎస్ పీడీ ఎం. ఎన్. రాణి, కడప అర్బన్ సిడిపిఒ సునంద ఆదేశాల మేరకు వీధి బాలలను గుర్తించే అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వ హించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బడిలో ఉండేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పిల్లలను పనులకు పంపిస్తే చట్ట పరమైన చర్యలు తక్కువని హెచ్చరించారు. కార్యక్రమంలో బాలల పరిరక్షణ విభాగం సామాజిక కార్యకర్త బి. వినోద్ కుమార్, సూపర్వైజర్ దీప, మహబూబ్ చాన్, కార్యకర్తలు అలి వేణి, సునీత, వార్డు మహిళా పోలీసులు పాల్గొన్నారు.

దేశానికి సేవలందించే స్థాయికి ఎదగాలి

కడప అర్బన్ : దేశానికి సేవలందించే స్థాయికి విద్యార్థులు ఎదగాలని రాష్ట్ర దూదేకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్య క్షులు మన్సూర్ అక్బర్ పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ ఉర్దూ స్కూల్లో 10వ తరగతిలో అధిక మార్కులు సాధించిన రెడ్డిసమీరాను, రసూల్‌బీని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మన్సూర్ అక్బర్ తన కార్యాలయంలో మాట్లా డుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ 500 మార్కులు సాధించిన నిరు పేద దూదేకుల పిల్లలకు ప్రోత్సాహం కింద బహుమతులు అందజే శామ న్నారు. తల్లి దండ్రులతో పాటు తాము విద్యా ర్థుల లక్ష్యానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్ర మంలో దూదేకుల హక్కుల పోరాట సమితి సలహా దారులు బాబయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుప్పం మల్లి, రాష్ట్ర వర్కింగ్ కార్యదర్శి గగ్గుటూర్ నజీర్,రాష్ట్ర ట్రెజరర్ రూపన గుడి హుస్సేన్ పాల్గొన్నారు.

రామస్వామి సేవలు చిరస్మరణీయం

కడప అర్బన్ : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కే.శే. రామస్వామి సేవలు చిర స్మరణీయమని ఆర్‌జెయుపి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం కొర్రపాటి రామస్వామి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహా నికి పూల మాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఓబులరెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, ప్రచార కార్యదర్శి బాబు, సీనియర్ నాయకులు వీరయ్య, వీరన్న, సత్యనా రాయణ, వెంకటేశ్వర రెడ్డి, సుదర్శన రెడ్డి పాల్గొన్నారు.

'ఆంధ్ర కేసరి'కి నివాళి

కడప : కడప నగర పాత కలెక్టర్ ఆఫీస్. ఎదురుగా. ఉన్న ఆంధ్ర ప్రదేశ్. ప్రభుత్వ విశ్రాం తి ఉద్యోగాల సంఘం కార్యా లయంలో శనివారం టంగు టూరి ప్రకాశం పంతులు. 66వ వర్ధంతి కార్య క్రమం నిర్వహించారు. ముందుగా జిల్లా పెన్షన్ల సంఘం ప్రధాన కార్యదర్శి. ఎస్. రామ్మూర్తి నాయుడు టంగుటూరి చిత్రానికి పూలవ ాలవేసి నివాళులు అర్పించారు.

ఘోరం!

ప్రజాదృష్టి

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు పెచ్చుమీరడం ఆందోళన కలి గిస్తోంది. సోమవారం కొండాపురం మండలంలో తూఫాన్ వాహనాన్ని ఎదురుగా వస్తున్న లారీ ఢీకొన్న ఘటనలో ఏడుగురు మృతి చెంద డం, ఏడుగురు తీవ్ర గాయాల బారిన పడడం తెలిసిందే. అదేరోజు ఖాజీపేట మండలంలో ఇసుక తీసుకొస్తున్న వాహన డ్రైవర్‌ను మరో వాహనం ఢీకొనడంతో అక్కడిక్కడే మృత్యువాత పడ్డారు. రోడ్డు ప్రమా దాల బారిన పడిన పలు కుటుంబాలు రోడ్డును పడుతున్న ఉదంతా లను చూస్తూ ఉండి పోవాల్సివ స్తోంది. మన పొరుగున ఉన్న సింగ పూర్, మలేషియా, గల్ఫ్ దేశాల్లో రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయ ంగా తగ్గుతున్న అను భవగతం చేసుకో వాల్సి ఉంది. జిల్లాలోని ఆర్ అండ్‌బి, ఆర్‌టిఒ డిపార్టుమెంట్ ఉన్నతాధికారులు రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించి కసరత్తు చేయాల్సి ఉంది. ప్రతియేటా రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నప్పటికీ ఆశించిన ఫలితాలు కని పించడం లేదు. ఆర్‌టిఒ డిపార్టుమెంట్ ఉన్నతాధికారులు లారీలు, తూఫాన్, తదితర వాహనాలకు పర్మిట్లు మంజూరును కఠినతరం చేయాలి. వాహ నదారు నుంచి డ్రైవర్లకు సంబంధించిన అనుభవా లను తరుచుగా పరిశీలించాలి. వాహన తనిఖీలను ముమ్మరం చేయాలి. తగిన లైసెన్స్, అర్హత కలిగిన డ్రైవర్‌తో కూడిన వాహనా లను అనుమతి ఇవ్వాలి. ఆర్ అండ్‌బి యంత్రాంగం రహదారులపై విశ్రాంతి గదులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. సుధీర్ఘం గా వాహనం నడిపిన డ్రైవర్లు విశ్రమించడానిక అవకాశాలను కల్పిం చారు. రహదారులపై సూచికలు, స్పీడోమీటర్లను ఏర్పాటు చేయడం ద్వారా వేగాన్ని నియంత్రించే చర్యలు తీసు కోవాలి. అధిక వేగాన్ని సంతరించకున్న వాహనాన్ని సాంకేతిక పరిక రాల సహకారంతో గుర్తి ంచి హెచ్చరించాలి. హెచ్చరికలను పాటించని డ్రైవర్లకు వెంటనే జరి మానాలు వెళ్లేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఈయేడాది జూన్‌లో నూ తన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేప థ్యంలో స్కూల్ వ్యాన్ల తనిఖీలను సైతం ముమ్మరం చేయాలి. అనుమతులు లేని, కాలం తీరిన స్కూల్ వ్యాన్‌లకు ఎటువంటి పరిస్థితుల్లో అనుమతులు మం జూరు చేయకూడదు. మంజూరు చేసిన అధికారులపై కఠినచర్యలు తీసుకున్నప్పుడే రోడ్డుప్రమాదాల నివారణ సాధ్యమయ్యే అవకాశాల ను పరిశీలించాలి.

- ప్రజాశక్తి - కడపప్రతినిధి

ఆర్‌డిఓ కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల రెవెన్యూ డివిజనల్ కార్యాలయ నిర్మాణాన్ని పట్టణంలోని శ్రీకృష్ణ ఆలయం పక్కన నిర్మించనున్నారు. ఆ మేరకు శనివారం ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్‌డిఒ వెంకటేశులు, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ భూమిపూజ చేశారు. వేదపండితుల సమక్షంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దీన్ని రూ.1.50 కోట్లతో నిర్మించనున్నారు. భవన నిర్మాణాలు వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఒఎస్‌డి ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి ఇఇ సిద్ధారెడ్డి, కమిషనర్ నరసింహారెడ్డి, డిఇలు, ఎఇలు, తహశీల్దారు మాధవ్ పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న ఒఎస్‌డి, ఆర్‌డిఒ, మున్సిపల్ చైర్మన్

28న ఎర్రగుంట్లలో ఉచిత వడుగులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలోని దొండపాడు రోడ్డులోని మసీదులో ఈనెల 28న ఉదయం 8గంటలకు ముస్లిం, నూర్‌బాషా పిల్లలకు మస్జిద్ యే హిదాయ కమిటీ, దాతల సహకారంతో ఉచిత వడుగులు చేయనున్నట్లు కమిటీ అధ్యక్షులు కమల్‌బాషా తెలిపారు. ఇందుకు సంబంధించి ఈ నెల 19 నుంచి 25 వరకు పిల్లలు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కమాల్‌బాషా 98664 54167, అబిద్ హుజర్ 98850 98827 సెల్ నంబర్లను సంప్రదించవచ్చునని తెలిపారు.

మినీ మహానాడుకు తరలిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఖాజీపేట

కడప నగరంలోని రహమతీయ ఫంక్షన్ హాలులో శనివారం జరిగిన టిడిపి మినీ మహానాడు కార్యక్రమానికి మండలం నుంచి పెద్ద ఎత్తున టిడిపి అభిమానులు, నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. టిడిపి మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో వెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ సిద్ధాంతాల గురించి అగ్ర నాయకులు ప్రసంగించారు. కార్యకర్తలు, నాయకులకు దిశ నిర్దేశం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జెండా మహబూబ్ బాషా, పత్తూరు ఉపసర్పంచ్ ముత్యాల రమణ, నరసింహులు యాదవ్, త్రిపురవరం హరినాథ్‌రెడ్డి, బండి చిన్న, నాగార్జున యాదవ్, పల్లె గంగాధర్, ప్రతాప్‌రెడ్డి, తుట్టె రాము యాదవ్, పుల్లయ్య నాయుడు, గోవింద సుబ్బయ్య పాల్గొన్నారు.

ఆంధ్రకేసరి, బ్రహ్మానందరెడ్డి చిత్ర పటాలకు నివాళి

ప్రజాశక్తి - వేంపల్లె

మాజీ ముఖ్యమంత్రులైన ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు, కాసు బ్రహ్మానందరెడ్డి చిత్ర పటాలకు శనివారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రకాశం పంతులు, కాసు బ్రహ్మానందరెడ్డి వర్ధంతుల సందర్భంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి మాట్లాడుతూ స్వతంత్ర సమర యోధుడుగా, ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడుగా, ముఖ్యమంత్రిగా ఆయన రాష్ట్రానికి, జాతి కాంగ్రెస్ పార్టీకి ప్రకాశం పంతులు సేవా చేసినట్లు చెప్పారు. కాసు బ్రహ్మానందరెడ్డి కూడా ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, మహారాష్ట్ర గవర్నర్‌గా, ఎఐసిసి అధ్యక్షుడుగా పని చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, అమర్, సుబ్బరాయుడు, శివ, బద్రి, వెంకటేష్, నాగార్జున, రామకృష్ణ, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఎల్ఇడి బల్బుల వినియోగంతో విద్యుత్ ఆదా

ప్రజాశక్తి - వేంపల్లె

ఎల్ఇడి బల్బుల వినియోగం చేయడం వల్ల విద్యుత్ ఆదా కావడంతోపాటు బిల్లులు కూడా తగ్గే అవకాశం ఉందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుబ్బారెడ్డి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక 3,4 వార్డుల్లో ఉన్న ప్రజలకు ఎల్ఇడి బల్బుల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బల్బులు వినియోగం పెంచేందుకు ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కంప్యూటర్ అధ్యాపకుడు షఫి, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ఫలితాల్లో విజేత పాఠశాల విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - ఖాజీపేట

పాలీసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాలు శనివారం వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో స్థానిక విజేత పాఠశాలకు చెందిన విద్యార్థి సాయిశ్రీధర్‌రెడ్డి 120కి 118 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 57 ర్యాంకు సాధించినట్లు ఆ పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్య ప్రతినిధులు వెంకటరమణ, లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు సాయి శ్రీధర్‌రెడ్డిని అభినందించారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. తమ పాఠశాలలో పేద తరగతి చదివిన విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరచడం హర్షణీయమన్నారు.

సాయిశ్రీధర్‌రెడ్డి

పోలీస్‌స్టేషన్ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్ఐ మైనుద్దీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని శనివారం మైదుకూరు రూరల్ సిఐ నరేంద్రరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌పి అన్బురాజన్ ఆదేశాల మేరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజల కోసం చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే ఆరుబయట తిరగాలన్నారు. జనసంచారం ఉండే కూడళ్లలో దాతలు ముందుకు వచ్చి చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మైనుద్దీన్, ఎఎస్ఐ నాగేంద్రప్రసాద్, పోలీస్ సిబ్బంది, జిఎంఎస్‌కెలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభిస్తున్న సిఐ నరేంద్రరెడ్డి

జీవాల దొంగలు అరెస్టు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

31 జీవాలను దొంగతనం చేసిన కేసులో ఐయుదుగురిని, ఏపి04 టిటి 8753 నంబర్‌గల గూడ్స్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసును నమోదు చేసినట్లు జమ్మలమడుగు అర్బన్ సిఐ ఎం. సదాశివయ్య తెలిపారు. స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 12,13 తేదీల్లో పట్టణంలోని రోటరీ నగర్ వద్ద ఉలవల అమరేశ్వర్‌రెడ్డికి చెందిన 18 జీవాలు, అలాగే యాదవ్ కాలనీకి చెందిన దూదేకుల నడిపి దస్తగిరికి చెందిన 13 జీవాలను దొంగలించినట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. వసం హరి, గంగాధర్‌రెడ్డి దొంగిలించిన జీవాలను శనివారం ఉదయం అశోక్ లైలాండ్ గూడ్స్ వాహనంలో మైదుకూరుకు తీసుకెళ్తున్నారనే సమాచారం మేరకు తనతోపాటు సిఐ సుబ్బారావు, సిబ్బంది దొంగలను పట్టుకున్నామన్నారు. దొంగలతోపాటు 31 జీవాలను, గూడ్స్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. జీవాల విలువ దాదాపు రెండు లక్షల 60 వేలు ఉంటుందన్నారు. ఈ కేసులో మరో నలుగురు ఉన్నారని, వారిని కూడా అరెస్టు చేస్తామని సిఐ తెలిపారు.

మాట్లాడుతున్న అర్బన్ సిఐ సదాశివయ్య

వామ్మో.. మాంసం కొనలేం

కిలో రూ.800తో అమ్మకాలు - అధికారుల ఆదేశాలు బేఖాతర్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మున్సిపాలిటీలో మాంసపు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇటీవల కాలంలో కిలో రూ.650తో మాంసాన్ని విక్రయించాలని పురపాలక అధికారులు వ్యాపారులు బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. దీన్ని బేఖాతరు చేస్తూ వ్యాపారులు కిలో రూ.800కు అమ్ముతున్నారు. అంతధర పెట్టినా మాంసం నాణ్యతగా ఉంటుందో లేదోనని వినియోగదారుల్లో అనుమానాలున్నాయి. పలువురు మాంసం వ్యాపారులు కల్తీతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా పండుగలు వస్తే చాలు మాంసం ధరలు అమాంతంగా పెంచుతున్నారు. ఈ ధర చూసి పేద, మధ్య తరగతి ప్రజలు కొనే పరిస్థితిలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవాలు కోసే సమయంలో డాక్టర్లచే పరీక్షించి ఆరోగ్యంగా ఉంటేనే దాని మాంసం విక్రయించాల్సి ఉంది. ఆ పని ఎక్కడా కనిపించదు. లింగాల మండలంలో కిలో రూ.650 నుంచి రూ.700కు మాంసం విక్రయిస్తున్నారు. పులివెందులలో మాత్రం రూ.800 వరకు మాంసం విక్రయాలు చేయడం దారుణమని ప్రజలు పేర్కొంటున్నారు. మాంసపు ధరలను అదుపుచేయాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉందని ప్రజలు అంటున్నారు. మాంసం ధర చూసి గ్రామాల్లో జీవాల పెంపకందార్లు కూడా వాటి రేట్లను అమాంతం పెంచుతున్నారు. మాంసపు రేటును అరికడితే గ్రామాల్లో జీవాల ధర కూడా తగ్గిపోయే అవకాశం కూడా ఉంది.

అధికారుల చర్యలులేకనే అధిక రేట్లు

ఎక్కడ లేని విధంగా పులివెందులలోనే కిలో మాంసం రూ.800తో వ్యాపారులు అమ్ముతున్నారు. పట్టణంలో ఒక రేటు, గ్రామాల్లో మరో రేటు ఉంటోంది. కూత వేటు ఉన్న గ్రామంలోనే రూ.650 నుంచి రూ.700తో మాంసాన్ని అమ్ముతున్నారు. ఇప్పుడైనా అధికారులు స్పందించి మాంసపు ధరలను గతంలో మాదిరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.

- మేకల విశ్వనాథ్, వెలమవారిపల్లె

కల్తీకి పాల్పడితే చర్యలు తీసుకుంటాం

మాంసపు దుకాణాదారులు కల్తీకి పాల్పడినా, అనారోగ్యంతో ఉన్న జీవాల మాంసం అమ్మినా చర్యలు తీసుకుంటాం. గతంలో తాము తనిఖీలు నిర్వహించి కిలో మాంసం రూ.650 అమ్మాలని చెప్పాం. ప్రస్తుతం ఎక్కువ ధరలు అమ్ముతున్నారని ప్రజలు మా దృష్టికి తెచ్చారు. ధరను నియంత్రించే విధంగా చర్యలు తీసుకుంటామం. కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతిరోజు మాంసపు దుకాణాలను తనిఖీలు చేస్తున్నాం.

- మురళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

మార్కెట్లో జీవాల రేటు ఎక్కువగా ఉంది

ప్రాణంతో ఉండే జీవాలు కిలో రూ.400 నుంచి రూ.450పైగా ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నాం. గిట్టుబాటు కోసం కిలో మాంసం రూ.800 విక్రయిస్తున్నాం.

- మాంసపు విక్రయదారులు

పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు చర్యలు

ప్రజాశక్తి - ముద్దనూరు

పత్తి పంటలో గులాబీ రంగు పురుగు, వేరుకుళ్ల తెగులు నివారణకు తగిన చర్యలతో జాగ్రత్తలు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం ఎపిడి పద్మలత, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ప్రత్యూష సూచించారు. మండలంలోని మంగపట్నం గ్రామంలో శనివారం స్థానిక వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఎపిడి పద్మలత మాట్లాడుతూ ఖరీఫ్‌లో బత్తాయి, వేరుశనగ, కంది, జొన్న, పత్తి పంట సాగులో మెలకువలు, పాటించవలసిన యాజమాన్య పద్ధతులను వివరించారు. ఎఒ వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ పిఎం కిసాన్ పథకం, కిసాన్ డ్రోన్ పరికరాలు, పంట మార్పిడి, విత్తనశుద్ధి, లో దుక్కుల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బాబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త ప్రత్యేష

గండి అన్నదాన పథకానికి విరాళం

ప్రజాశక్తి - వేంపల్లె

గండి వీరాంజనేయ స్వామి శాశ్వత అన్నదానం పథకానికి వేంపల్లెకు చెందిన వైసిపి నాయకుడు నల్లమేకల కృష్ణయ్య విరాళం అందజేశారు. శనివారం గండి క్షేత్రంలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో గండి చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుం దరెడ్డికి చింతలమడుగుపల్లెకు చెందిన కృష్ణయ్య, లక్ష్మీదేవి రూ.50,116 గండి నిత్యన్నదానం పథకానికి అందజేశారు. విరాళం ఇవ్వడం సంతోష కరమని ఆలయ అధికారి ముకుందరెడ్డి చెప్పారు. నిత్యన్నదానం పథకానికి మరింత సహకారం చేసేందుకు కృషి చేస్తానని దాత కృష్ణయ్య తెలిపారు. విరాళాల కౌంటర్ ద్వారా లక్ష రూపాయలపైన వచ్చినట్లు చెప్పారు. విరాళం అందజేసిన దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శనం చేయించి తీర్థ ప్రసా దాలు అందజేశారు. కార్యక్రమంలో యశ్వంత్, యశోద పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న కృష్ణయ్య కుటుంబసభ్యులు

ఘనంగా జూనియర్ ఎన్‌టిఆర్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలోని రామిరెడ్డిపల్లె సర్కిల్‌లో మహబూబ్ ఆటో కన్సల్టెన్సీలో జూనియర్ ఎన్‌టిఆర్ పుట్టినరోజు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆ మేరకు జూనియర్ ఎన్‌టిఆర్ అభిమానులు మాపిర, అల్తాఫ్, అభిమానులు కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిండు నూరేళ్లు జూనియర్ ఎన్‌టిఆర్ వర్ధిల్లాలని ఆకాంక్షించారు. తమ అభిమాని మరెన్నో సినిమాల్లో నటించి ఆస్కార్ అవార్డులను అందుకోవాలన్నారు. కార్యక్రమంలో కిషోర్, మునాఫ్, రాజు, దాస్, కులాయప్ప, పెద్ద నరసింహులు, షబ్బీర్, శివ, అశోక్, హాజీబాషా పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న జూనియర్ ఎన్‌టిఆర్ అభిమానులు

ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మన చేతుల్లోనే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మన చేతుల్లోనే ఉందని ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజారామ్‌మోహన్‌రెడ్డి అన్నారు. జనవిజ్ఞాన వేదిక (జెవివి) వేసవి శిబిరంలో భాగంగా శనివారం 'ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎలా' అనే అంశంపై జెవివి కార్యాలయంలో జెవివి జిల్లా ఆరోగ్యవిభాగం కన్వీనర్ డాక్టర్ చక్రధర్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ వేసవిలో మంచినీరు అధికంగా తీసుకోవాలన్నారు. నీటిని కాచి వడబోసి చల్లార్చి తాగితే ఇంకా మంచిదన్నారు. సెల్‌ఫోన్ అవసరం మేరకు మాత్రమే వినియోగించాలన్నారు. లేని పక్షంలో మానసిక వ్యాధులతోపాటు కంటిచూపు తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. జ్ఞాపకశక్తి తగ్గిపోవడంతోపాటు చెముడు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. నోటి ఆరోగ్య సమస్యలు రాకుండా రోజుకు రెండుసార్లు దంతాలు శుభ్రం చేసుకోవాలన్నారు. గోర్లను కత్తిరించుకోవాలన్నారు. జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వాసురేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి సునీత, లాయర్ హరిత, సమన్వయకర్తలు అక్షయ, చరణ్, హాసిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాజారామ్‌మోహన్‌రెడ్డి

మజ్జిగ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కాశినాయన

మండల కేంద్రమైన నరసాపురంలో ఏర్పాటుచేసిన పోలేరమ్మ తిరుణాల సందర్భంగా ఉచితంగా శెట్టి రామచంద్రయ్య కుమారుడు శ్రీనివాస్ రాయల్ ఏర్పాటు చేసిన మజ్జిగ కేంద్రాన్ని శనివారం బద్వేల్ తెలుగుదేశం పార్టీ నాయకుడు వెంకటరెడ్డి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ తిరు ణాలలో మండుటెండలో చల్లని మజ్జిగ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఆయన ఉచిత అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. వైస్ ప్రెసిడెంట్ నాగేందర్‌రెడ్డి, కర్నాటి వెంకటరామిరెడ్డి, శ్రీనివాస్‌రాయల్ పాల్గొన్నారు.

మనస్థాపంతో వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-కాశినాయన

మండల పరిధిలోని రామేశ్వరం గ్రామానికి చెందిన ఓ. వెంకటరాజు (70) మనస్థాపానికి గురై శనివారం తన స్వగృహంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువుల వివరాల మేరకు.. ఇటీవల ఆయన సతీమణి అనారోగ్య కారణాలతో మృతిచెందింది. దాన్ని జీర్ణించుకోలేక నిత్యం బాధపడుతూ పడేవాడు. ఈనేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకోవడంతో గమనించిన బంధువులు ఆయన్ని పోరుమామిళ్ల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతిచెందాడని వైద్యులు చెప్పారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి వీరనాల శివనారాయణ, ఓబులేసు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ మనోహర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేనేతపై జిఎస్‌టి విధించడం ద్వారా వస్త్ర రంగానికి భారమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు 3 సెంట్ల స్థలం ఇవ్వాలని, ఇల్లు కట్టించుకునేదానికి ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్ష సరిపోదని తెలిపారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా రూ.6లక్షలు ఇవ్వాలన్నారు. ప్రధానంగా ప్రతి చేనేత కార్మికుడికి 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు సౌకర్యం గతంలో ఇచ్చేవారని నిదానంగా అది మరుచారన్నారు. 45ఏళ్లు దాటిన చేనేత మహిళలకు ఆసరా, చేయూత పథకాలు అమలు చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు పల్లా లక్ష్మినారాయణ, సంజీవ రాయుడు, ముని, ధనుంజయ పాల్గొన్నారు.

డిటికి వినతిపత్రమిస్తున్న చేనేత కార్మిక సంఘ నాయకులు

ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నగర పంచాయతీ అద్వర్యంలో స్థానిక రాణివనం సచివాలయంలో రెడ్యూస్, రీయూస్, రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) సెంటర్‌ను ప్రారంభించినట్లు మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఇంటివద్దకు వచ్చు చెత్త సేకరణ వాహనానికి తిరిగి వినియోగించు (డ్రై వెస్ట్) వస్తువులను అందజేస్తే వాటిని అందంగా అలంకరించి మళ్లీ వినియోగానికి వేసులుబాటు కల్పించుకొనవచ్చునని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో వృథాగా పక్కన పడవేసిన వస్తువులను సేకరించి అవి మళ్లీ ఉపయోగపడేలా చేసి పట్టణంలోని పేదవారికి స్వయంగా, స్వచ్ఛంద సంస్థల సహకారంతో అందజేయడమే ఈ ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మదుకుమార్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ సందీప్ పాల్గొన్నారు.

రాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి : కడప వారి కోర్టులో

O.S.No.41/2022

డి.లక్ష్మినారాయణరెడ్డి ...వాది

V/s

1. షేక్ సిద్ధిక్ & 2 ఇతరులు ...ప్రతివాదులు

మరియు

I.A.No.215/2022
O.S.No. 41/2022

డి.లక్ష్మినారాయణరెడ్డి ...పిటీషనర్/వాది

V/s

1. షేక్ సిద్ధిక్ & 2 ఇతరులు ...రెస్పాండెంట్లు/ప్రతివాదులు

పై దావాలో 1వ ప్రతివాదికి పత్రికా ముఖముగా సమను & I.A.లో 1వ రెస్పాండెంటుకు పత్రికాముఖముగా నోటీసు

To,
షేక్ సిద్ధిక్, S/o ఖాదర్‌బాషా, వయస్సు సుమారు 23 సంIIలు, 8/726-32, అఫ్సర్‌ఖాన్ కాలనీ, H/o అల్మాస్‌పేట, కడప నగరం, ఆధార్ నెం.7490 8734 8938.

అను మీమీద మరియు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు వారి మీద వాది స్పెషిఫిక్ ఫర్ఫార్మెన్స్ ఆఫ్ అగ్రిమెంట్ మరియు పర్మనెంట్ ఇంజక్షన్ ఉత్తర్వులు కోరుచూ పై దావా సలిపియున్నారు. సదరు దావా మీ యొక్క హాజరుకు గాను 22/6/2023వ తేదీకి వాయిదా వున్నది. కావున సదరు 22.6.2023వ తేదీ ఉ.గం.10.30నిIIలకు మీరు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీకు ఏవైనా ఆక్షేపణలు/అభ్యంతరాలు వున్న యెడల కోర్టు వారికి తెలుపుకోనంతట, పై దావాను మీ పరోక్షముగా తీర్మానించెదరు.

అలాగే పై దావాలో I.A.No. 215/2022 రు క్రింద మీ పైన ఎక్స్‌పార్టీ యాడ్ ఇంటీరియమ్ టెంపరరీ ఇంజక్షన్ కోరుచూ పై I.A. సలుపగా, సదరు I.A. కూడా మీ యొక్క హాజరుకు గాను 22/6/2023వ తేదీ వాయిదా వున్నది. కావున సదరు 22/6/2023వ తేదీ ఉ.గం.10.30నిIIలకు మీరు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీకు ఏవైనా ఆక్షేపణలు/అభ్యంతరాలు వున్న యెడల కోర్టు వారికి తెలుపుకోనంతట, పై I.A.ని మీ పరోక్షముగా తీర్మానించెదరు.

ది:21.05.2023.

//రాజశ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు//

ఎమ్.సుధాకర్‌బాబ్జీ,
వకీలు, కడప.

సిబ్బందికి సూచనలిస్తున్న జెసి గణేష్‌కుమార్

రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించిన జెసి

ప్రజాశక్తి - దువ్వూరు

స్థానిక తహ శీల్దార్ కార్యాలయాన్ని శని వారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ సందర్శిం చారు ఆయన వెంట జమ్మలమడుగు ఆర్‌డిఒ శ్రీనివాసులు పాల్గొన్నారు. కార్యాలయంలో జరుగు తున్న ఆధునీకరణ పనులను, సిబ్బంది పనితీరును తెలుసుకున్నారు. అలాగే భూ సర్వే గురించి తహశీల్దార్ రమాకుమారిని అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించి, ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పవద్దని ఆదేశించారు. తహశీల్దార్‌కు పలు సూచనలు చేశారు.

శ్రీకృష్ణుని రూపంలో ఉన్న విగ్రహస్థాపన ఆపాలి

ప్రజాశక్తి - చాపాడు

ఖమ్మంలో శ్రీకృష్ణుని రూపంలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహ ఏర్పాటును ప్రభుత్వం ఆపాలని జాతీయ వాద రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి పెరుగు భవానిశంకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విగ్రహ ఏర్పాటుకు టిఆర్‌ఎస్ ప్రభుత్వం అనుమతి ఇవ్వడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఏ రాజకీయ ప్రయోజనాలను ఆశించి భగవాన్ శ్రీకృష్ణుని ఎన్‌టిఆర్ విగ్రహంలో చూపించదలిచారని ప్రశ్నించారు. ఎన్‌టిఆర్ ప్రజల అభిమానాన్ని పొందిన నాయకుడు మాత్రమే అని దేవుడు కాదన్నారు. అభిమానం ఉంటే ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయాలని, తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు.

మద్యపాన నిషేధం అమలు చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఆంధ్రప్రదేశ్‌లో మద్యపాన నిషేధం అమలు చేయాలని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా, జిల్లా కో-కన్వీనర్ దాదాపీర్ డిమాండ్ చేశారు. శనివారం వేంపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రకటించిన మద్యపాన నిషేధం హామీ నాలుగేళ్లు పూర్తయిని నెరవేరలేదన్నారు. విచిత్ర పేర్లతో అధిక ధరలకు విక్రయిస్తూ ప్రజా జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నమ్మి ఓట్లు వేసిన పాపానికి వైసిపి ప్రజలను కటిక చీకటిలోకి నెట్టివేసిందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని వైసిపి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదన్నారు. రాష్ట్రంలో మద్యపాన నిషేధం అమలు చేసిన తర్వాతే ప్రజలను ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు.

నిశ్చితార్థంలో ప్రజాప్రతినిధుల సందడి

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

దేశాయి కృష్ణారెడ కుమారుడు చరణ్ రెడ్డి నిశ్చితార్థ కార్యక్రమానికి విద్యుత్, సైన్స్ అండ్ టెక్నాలజీ, అటవీ పర్యావరణ శాఖ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రభుత్వ సలహాదారు పి నాగార్జున రెడ్డి, ఎమ్మెల్యే రఘురాం రెడ్డి, ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి మరికొందరు సందడి చేశారు. ఇంకా వేడుకల్లో బ్రహ్మంగారిమఠం ఎంపిపి వీరనారాయణ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తులసి రెడ్డి , సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, రాజంపేట నాయకులు మదన్ మోహన్ రెడ్డి, జడ్‌పిటిసి సత్యనారాయణ రెడ్డి , దేశాయి దేవేంద్ర రెడ్డి , వైసిపి ముఖ్య నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు హాజరయ్యారు.

డ్వాక్రా మహిళలకు తిప్పలే

కాశినాయన : రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు ఎలాంటి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినా వారికి తిప్పలు తప్పడం లేదు. లబ్ధిదారులు ప్రభుత్వం నుంచి పథకాల లబ్ధి పొందాలంటే అవస్థలు పడాల్సిందే. వెలుగు సిబ్బంది డ్వాక్రా మహిళలకు ఇవ్వాల్సిన లబ్ధి విషయంలో మెలిక పెడుతున్నారు. దీనివల్ల తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని లబ్దిదారులు వాపోతున్నారు. మండలంలో ఇటీవల ఆసరా డబ్బులు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ విషయంలో మహిళలను యానిమేటర్లు, సిసిలు 'మీరు పది, పదిహేనళ్ల కిందట బాకీ తీసుకున్నారు.. ఇప్పుడు కట్టకపోతే ఆసరా డబ్బులు ఇవ్వం' అని కొత్త మెలిక పెడుతూ మహిళలను నానా అవస్థలకు గురిచేస్తున్నారు. పైగా ఒకొక్కరూ రూ.240 చెల్లిస్తేనే ఆసరా డబ్బులు ఇస్తామని వెలుగు సిబ్బంది బెదిరిస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. ఆసరా డబ్బులే కాదు ప్రభుత్వం నుంచి ఎలాంటి లబ్ధి పొందాలన్నా అధికారులు, సిబ్బంది తమల్ని ఇబ్బందులకు పెడుతున్నారని వాపోయారు. రోజుల తరబడి మండలంలోని వెలుగు కార్యాలయం చుట్టు తిరిగినా తమ కష్టాలు తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెలుగు కార్యాలయంపై దృష్టి సారించి తమ కష్టాలను తీర్చాలని డ్వాక్రా కోరుతున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని జమ్మలమడుగు నగర పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా పేర్కొన్నారు. శనివారం ఉదయం పట్టణంలోని మాస్టర్ పాయింట్‌లో రెడ్యూస్ రియూస్ రీసైక్లింగ్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు విరివిగా మొక్కలను పెంచాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీలు, మెప్మా సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
జమ్మలమడుగు బ్రాంచ్
చిరునామా: 1/91, రామలింగ రెడ్డి కాంప్లెక్స్, క్యాంప్ బెల్ హాస్పిటల్ ఎదురుగా, ప్రొద్దుటూరు రోడ్, జమ్మలమడుగు, వైఎస్ఆర్ కడప జిల్లా -516434, ఎ.పి.

స్వాధీనతా ప్రకటన సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్-2002లోని (రూల్ -8(1))(స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జమ్మలమడుగు బ్రాంచ్ (10391) యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ రుణగ్రహీతలు/హామీదారులు: 1) **శ్రీమతి తలారి కొండబోయిన సుబ్బలక్ష్మమ్మ,** భర్త తలారి కొండబోయిన సుబ్బరాయుడు, నివాసం: ఇ.నె.2-2-10సి, ఎస్‌బిఐ కాలనీ, జమ్మలమడుగు, కడప-516434 మరియు 2) **శీమతి తలారి కొండబోయిన సుబ్బలక్ష్మమ్మ,** భర్త తలారి కొండబోయిన సుబ్బరాయుడు, నివాసం: 3-26, ఎస్‌బిఐ కాలనీ, జమ్మలమడుగు, కడప-516434 మరియు 3) **శ్రీ. తలారి శ్రీనివాసులు,** భర్త తలారి కొండబోయిన సుబ్బరాయుడు మరియు 4) **శ్రీ తలారి కొండబోయిన సుబ్బరాయుడు** తండ్రి టి కె బాల సమ్మన్న, ఇరువురి నివాసం: ఇ.నె.2-2-10సి, ఎస్‌బిఐ కాలనీ, జమ్మలమడుగు, కడప-516434 వారిని సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసుల్లో పేర్కొన్న మొత్తం పేర్కొన్న **రూ.3,67,552.32/-** (రూపాయలు మూడులక్షల అరవైఏడువేల ఐదువందల యాభైరెండు & ముప్పైరెండు పైసలు మాత్రమే) మరియు దానిపై వడ్డీ & ఖర్చులను తిరిగిచెల్లించవలసిందిగా కోరుతూ తేది.**28.02.2023**నాటి డిమాండ్ నోటీసు జారీచేశారు.

రుణగ్రహీతలు మొత్తంను తిరిగిచెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి నోటీసు ఇవ్వడమేమనగా క్రింది సంతకందారు సెక్యూరిటి ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదువగల సదరుచట్టంలోని సెక్షన్13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తులను **16.05.2023**న స్వాధీనంలోకి తీసుకున్నారు. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్ని ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, సదరు ఆస్తులతో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తులతో ఏవేని లావాదేవీలు జరుపదలచిన వారు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జమ్మలమడుగు బ్రాంచ్** వారికి చెల్లించుటకు లోబడి ఉంటుంది. ఒకవేళ చెల్లించిన ఏవేని బకాయిలను ఖాతాలో తది చెల్లింపు సమయానికి సర్దుబాటు చేయబడును.

సెక్యూర్డు ఆస్తుల విమోచనానికి అందుబాటులోగల సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్ నియామల క్రింద రుణగ్రహీత శ్రద్ధను కోరుతున్నారు.

<u>సెక్యూర్డు అసెట్ యొక్క వివరణ:</u>

డోర్ నెం.3/26, సర్వే నెం.561/1బి, బ్యాంక్ కాలనీ, సాయిబాబా టెంపుల్ దగ్గరగల శ్రీమతి తలారి కొండబోయిన సుబ్బలక్ష్మమ్మ వారిపేరునగల 1822.44చ.అ.లు (సేల్ డీడ్ ప్రకారం) లేదా 3.90 సెంట్లు (ఆమోదిత ప్లాన్‌ప్రకారం) విస్తీర్ణపు బిల్డింగ్స్‌తో నివాసిత స్థలం మొత్తం భాగం మరియు సరిహద్దులు:
తూర్పు: దోర పార్వతికి చెందిన ప్లాట్ నెం.6(పార్ట్), పడమర: పోటు రాములమ్మకు చెందిన ప్లాట్ నెం.7(పార్ట్), ఉత్తరం: 18 లింకులు (లేదా) 12అ.వెడల్పు రోడ్డు, దక్షణం: పి కె రామయ్య సైటు,(సేల్ డీడ్ నెం.6080/2012 ప్రకారం)

తేది: 16.05.2023
ప్రదేశం : కడప.

సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 21 మే 2023

వ్యవసాయ రంగంలో డ్రోన్ల ప్రాముఖ్యత

కలికిరి : వ్యవసాయ రంగంలో డ్రోన్ ప్రాముఖ్యత గురించి మండలం ఫతేగడ రైతు భరోసా కేంద్రంలో శనివారం రైతులకు వ్యవసాయ రంగంలో డ్రోన్ల ప్రాముఖ్యత గురించిసహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీకాంత్ రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన వ్యవసాయ రంగంలో కిసాన్ డ్రోన్ల ప్రాముఖ్యత, వాటి ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారి చేసుకోవచ్చుని దీని ద్వారా సమయం ఆదా కావడమే కాకుండా రైతులకు పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. ప్రభుత్వం రాయితీపై కిసాన్ డ్రోన్లను అందిస్తుందని, నిరుద్యోగ యువతకు ఉపాధి కూడా లభిస్తుందని అన్నారు. అగ్రికల్చర్ డిప్లమా చదివిన వారికి ప్రాధాన్యతను ఇచ్చి రాయితీపై పరికరాలను అందజేస్తారని తెలిపారు. ఎంపిక చేయబడిన వారికి గుంటూరులో 12 రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇస్తారని అన్నారు. ఆర్‌బికె ద్వారా రాయితీపై అందిస్తున్న జనుము, జీలుగా విత్తనాలను రైతులు వినియోగించుకొని నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ అధిక దిగుబడులు సాధించాలని కోరారు. అదే విధంగా మట్టి నమూనాలను ఆర్‌బికె సిబ్బంది ద్వారా భూసార పరీక్షా కేంద్రాల వద్దకు పంపి సాయిల్ హెల్త్ కార్డును అనుసరించి పొలాలలో ఎరువులు వేసుకోవాలని తెలిపారు.

అలవెన్సులకూ..ఆంక్షలు!

పేరుకే రూ.23 పెంపు..ఆచరణలో మెలిక

ప్రతి కూలీపై సరాసరి రూ.60 తెగ్గోత

ప్రస్తుతం కూలి రూ. 200లే

కేంద్రంలోని బిజెపిప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ఉద్దేశ పూర్వకంగా నిర్వీర్యం చేస్తోంది. ప్రతియేటా బడ్జెట్ కుదింపు దగ్గర నుంచి డిమాండ్ పేరుతో కూలీలకు ఉపాధి పనుల కోత, రూ.23 అరకొర అలవెన్స్‌కు ఐదు గంటలు పని చేయాలనే ఆంక్షలు విధిం చడం, కొరముట్ల కొరత వరకు ఉద్దేశపూర్వకంగా నిర్జీవం చేస్తోంది. ఈలెక్కన రూ.60 మేర అలవెన్స్‌ను కుదించినట్లు లెక్కలు చెబుతుం డడం గమనార్హం. దీనికితోడు ఈయేడాది నుంచి ఎన్‌ఎంఎస్ సాఫ్ట్ వేర్‌ను రూప కల్పన చేసి రాష్ట్రప్రభుత్వ పరిధిలోని ఉపాధి హామీ వ్యవహారాల్ని తన గుప్పిట్లోకి తీసుకుంది. ఇప్పటివరకు రాష్ట్రప్రభు త్వాలు ఉపాధి కూలీ లకు కల్పిస్తున్న సదుపాయాలపై దాడి చేయడం మొదలుపెట్టింది. కేంద్రప్రభుత్వ ఇటీవలి విన్యాసాల కారణంగా ఉపాధికూలీల నోట్లోకి ఐదు వేళ్లను అమాంతంగా వెనక్కి లాగేయనుం డడం ఆందోళన కలి గిస్తోంది.

ప్రజాశక్తి - కడపప్రతినిధి

జిల్లాలోని పెండ్లిమర్రి మండలంలోని 19 పంచాయతీల్లో 73 ప్రదేశాల్లో ఉపాధి హామీ పనులు చేపట్టారు. ఇందులోభాగంగా శని వారం 4,100 మంది ఉపాధి పనులకు హాజరయ్యారు. కేంద్రంలోని బిజెపి సర్కారు ఉపాధి పనుల్లో పారదర్శకత పేరుతో తెచ్చిన ఎన్ ఎంఎస్ సాఫ్ట్‌వేర్ కింద డిమాండ్ పొందిన ఉపాధి కూలీలు వారం లో నాలుగు రోజులు పనులకు హాజరై మిగిలిన మూడు రోజులు వెళ్లకపోతే వారం రోజులను ఉపాధి కల్పించినట్లు జమ చేస్తోంది. ఫలితంగా డిమాండ్ పొందిన కూలీలు మూడు రోజుల ఉపాధిని వదులుకోవాల్సిన దుస్థితి దాపురించింది.

కోతలే..కోతలు

ఇటీవల ఉపాధి కూలి ప్రదేశాల్లో కూలీల సంరక్షణకు ఉద్దే శించిన సదుపాయాలను తుంగలో తొక్కింది. ఫలితంగా ఉపాధి కూలీలకు రూ.60 వరకు అలవెన్స్‌ను ఉపసంహరించుకుంది. ఫలి తంగా పెండ్లిమర్రి మండలంలోనే ఒక్కరోజుకు సంబంధించి రూ. 2.46 లక్షలు నష్టపోతున్నట్లు తేలుతోంది. వాటి వివరాలను పరి శీలిస్తే గతంలో ఉపాధి కూలీలు రూ.30 వేసవి అలవెన్స్, మేట్ అల వెన్స్ రూ.20, తాగునీటికి రూ. ఐదు, గడ్డపారకు రూ.ఐదు, తట్టా బుట్టకు రూ.ఐదు, మజ్జిగకు రూ.ఐదు, ఆటో ఛార్జీలకు రూ.20 చొప్పున చెల్లించడం తెలిసిందే. ఇందులో ఆటోఛార్జీలను మినహా యిస్తే వేసవి అలవెన్స్‌ను రూ.23 ఇస్తున్నట్లు చెబుతూ, ఐదు గంటల పాటు పని చేస్తేనే ఇస్తామని మెలిక పెట్టింది. ఎటు వంటి సదు పాయాలు లేని పనిప్రదేశాల్లో ఐదు గంటలు పని చేయడం సాధ్యం కావడం లేదు. ఫలితంగా వేసవి అలవెన్స్ పొందే అవకాశం లేకు ండా పోయిందనే వాదన వినిపిస్తోంది. తాగునీటికి, మజ్జి గకు, గడ్డ పారకు, తట్టాబుట్టకు ఐదేసి రూపాయల చొప్పున ఇవ్వాల్సిన అల వెన్స్‌కు తుంగలో తొక్కింది.

వసతుల కల్పన ఒట్టిమాటే

ఉపాధి ప్రదేశాల్లో వసతుల కల్పన ఒట్టి భ్రమను తలపిస్తోంది. 2014లో ఇచ్చిన టెంట్లు, కొరముట్లు మరమ్మతులకు గురవడం, మరమ్మతులకు ఒక్క రూపాయిని విడుదల చేయక పోవడం, వస తుల కల్పన పర్యవేక్షించే మేట్లను తొలగించడం వంటి పనులతో ఉపాధి హామీ పథకం నిర్వీర్యమవుతోంది. దీనికి తోడు ఉపాధి కూలీ లకు సంరక్షనకు ఉద్దేశించిన మెడికల్ కిట్ దగ్గర నుంచి తాగునీరు, మజ్జిగ, గాయాల బారిన పడిన వారికి రూ.2,000 నుంచి రూ.50, 000 వరకు చెల్లించే పరిస్థితులకు కాలం తీరిపోయిందనే వాదన వినిపిస్తోంది.

కూలి అరకొరే!

2014 నుంచి కూలి పెరుగుదలకు నోచుకోవడం లేదు. 2014లో ఉపాధి కూలి రూ.272 ఉండగా, పదేళ్ల అనంతరం రూ. 272 ఉండడం గమనార్హం. ఏటా 15 శాతంపైగా ధరలు పెరుగు తున్న నేపథ్యంలో ఉపాధి కూలి రూ.600 పెరగాల్సి ఉంది. వాస్త వంలో సగటు కూలిని పరిశీలిస్తే రూ.254 మించి పడడం లేదని తెలుస్తోంది. నేలల్లో హార్డ్‌కోర్ పడడం, పనుల పరిమాణంలోని గుం తల లోతు, పొడవు పరిమాణాలను పెంచడం వంటి కారణాల రీత్యా కూలికి రూ.200 పరిమితమైంది. దీనికితోడు గ్రామాల నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో పనులు కల్పించడం పరిపాటిగా మారింది. పనుల ప్రదేశాలకు వెళ్లడానికి ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఆటో రాకపోకలకు రూ.20 చెల్లింపులను కలిపితే రూ.220 మించి పడడం లేదని తెలుస్తోంది. ఈలెక్కన ప్రతి ఉపాధి కూలి సుమారు రూ.60 వరకు కోల్పోవాల్సి రావడం విస్మయాన్ని కలిగిస్తోంది.

వసతి సదుపాయాలు కల్పించాలి

మండుటెండల్లో ఉపాధి పనులు చేయడం కష్టంగా ఉంది. కనీస వసతి సదుపాయాలైన టెంట్లు, తాగునీరు, మజ్జిగ, ప్రాణాధార ఔషధాలను అందుబాటులో ఉంచాలి. వేసవిలో ఎండ తాకిడికి గురై తే తమ కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉంటుందని గ్రహిం చాలి.

పార్నపల్లి, రామసుబ్బమ్మ, కొత్తపల్లి, పెండ్లిమర్రి.

అలవెన్స్ షరతులు దారుణం

వేసవి అలవెన్స్‌ను కుదించడం దారుణం. మండుటెండల్లో ఐదు గంటలు పని చేస్తేనే అలవెన్స్ వర్తింపు చేస్తామనడం తగదు. ఇటువంటి పరిస్థితుల్లో తమకు ఇవ్వాల్సిన అలవెన్స్, కూలిపై షర తులు విధించడం అన్యాయం. విధిలేని పరిస్థితుల్లో చేస్తున్న మనుగడ కోసం చేస్తున్న కష్టాన్ని గుర్తించాలి.

నరసింహకుమార్‌రెడ్డి, యాదవాపురం, పెండ్లిమర్రి,

కూలి పెంచే వరకు పోరు

రూ.600 కూలి పెంచే వరకు పోరాటం చేస్తాం. పదేళ్ల నుంచి రూ.272 మించి పెంచకపోవడం దారుణం. ప్రతియేటా పెరుగు తున్న ధరల పరిమాణం మేరకు పెంపుదల ఉండాలి. వేసవి సీజన్ లో పదెకరాలు పొలం కలిగిన రైతులూ ఉపాధి పనులకు హాజరవు తున్న నేపథ్యంలో ఉపాధి పనులూ పెరగాలి, కూలి రేటును పెం చాల్సి ఉంది.

అన్వేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, కడప.

మూడు రోజుల్లో ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటు

స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల కేంద్రంలోని పులపుత్తూరు ఎస్‌సి కాలనీలో మూడు రోజుల్లో ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని గ్రామస్తులకు కలెక్టర్ గిరీష పిఎస్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని పులపుత్తూరు దళితవాడ, ఎస్సీ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పురోగతిని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడ నెలకొన్న సమస్యలను స్థానికుల ద్వారా అడిగి తెలు సుకున్నారు. ని అక్కడికక్కడే అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పైప్ లైన్, కొళాయి, వీధి దీపాలు వచ్చే శనివారంలోగా పూర్తి కావాలని అధికా రులను ఆదేశించారు. గుడారాలు వేసుకుని ఉన్న 20 మంది ఇళ్లను జూన్ 20లోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఎస్సీ కాలనీలో మూడు రోజుల్లో విద్యుత్ సౌకర్యం ఇవ్వాలని సూచించారు. వారం లోపల శ్మశానం స్థలం చూపించాలని తహశీల్దార్ సుబ్రమణ్యం రెడ్డిని ఆదేశించారు. ఇంకా అర్హులైన లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. పిల్లలు ఆడుకో వడానికి రెండు ఎకరాల ఆటస్థలం కేటాయి ంచాలని సూచించారు. ఆలయ నిర్మాణం కోసం స్థల కేటాయింపు చేయాలన్నారు. ఇంకా ఇంటి పట్టాలు ఇవ్వకుండా ఉన్నవారికి శనివారంలోగా ఇవ్వాలన్నారు. వచ్చేవారం గ్రామాన్ని సందర్శించి భూ సమస్యల పైన సమావేశం నిర్వహించి పరిష్కరించాలని సబ్ కలెక్టర్‌ను ఆదేశించారు. నెలలోగా అన్ని సమస్యలు పరిష్కరిస్తామని గ్రామస్తులకు కలెక్టర్ తెలిపారు. అందులో భాగంగా ఎన్ని ఇళ్లు పూర్తయ్యాయి, ఇంకా ఎన్ని పూర్తి కావాలి, నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయి తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసు కున్నారు. పనులు వేగవంతం చేయాల న్నారు. వచ్చేవారం మళ్లీ ఈ లేఔట్ సందర్శిస్తానని, ఆలోపు పురోగతి లేకపోతే చర్యలు తప్పవని హెచ్చ రించారు. కలెక్టర్ వెంట రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మన్ అహమ్మద్ ఖాన్, గృహ నిర్మాణ శాఖ పీడీ శివయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ప్రసన్న కుమార్, ఇరిగేషన్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో నలుగురికి ఉద్యోగాలు

ఎంపికైన విద్యార్థులతో యాజమాన్యం

ప్రజాశక్తి-పీలేరు

స్థానిక ఎంజెఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలోలో శనివారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో నలుగురు విద్యార్థులు ఉద్యో గాలకు అర్హత సాధించారని బెంగళూ రుకు చెందిన ఇండిక్యూ సాఫ్ట్ కంపెనీ హెచ్‌ఆర్ సుజయ్ తెలిపారు. ఎంపి కలను మూడు దశల్లో నిర్వహించామని అన్నారు. మొదటి దశ రాత పరీక్షలకు 132 మంది విద్యార్థులు హాజరు కాగా 28 మంది రెండవ, మూడవ దశ సామూహిక చర్చలు, హెచ్‌ఆర్ రౌండులో పాల్గొని నలుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులు ఏడాదికి రూ.2.8 లక్షల ప్యాకేజీని వేతనంగా పొందుతారని కంపెనీ హెచ్‌ఆర్ చెప్పారు. ఈ సందర్భంగా ఎంజెఆర్ కళాశాల చైర్మన్ అవినాష్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్లేస్మెంట్ ఇన్‌ఛార్జీలు మధులిక, సురేష్, సురేంద్ర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి బిసి సెల్ నాయకులు సురేంద్రయాదవ్

రేపు బిసి విభాగం సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అచ్చన్న నాయుడు, రాష్ట్ర బిసి సెల్ అధ్యక్షులు కొల్లు రవీంద్ర, రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు అర్.శ్రీనివాసులురెడ్డి ఆదేశాల మేరకు రాజంపేట పార్లమెంట్ బిసి విభాగం సర్వసభ్య సమావేశం ఈ నెల 22న సోమవారం నిర్వహించనున్నట్లు రాజంపేట పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్ తెలిపారు. శనివారం మదనపల్లె టిడిపి కార్యాలయంలో బిసి నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 11 గంటలకు మదనపల్లి పట్టణం అన్న మయ్య సర్కిల్, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గం కార్యాలయంలో ప్రకటించారు. సమావేశానికి పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గ ఇన్‌ఛార్జులు , మాజీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, రాష్ట్ర, రాజంపేట పార్లమెంట్ పరిధిలోని బిసి కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర, పార్లమెంట్ సాధికార కమిటీ కన్వీనర్లు, సభ్యులు, రాష్ట్ర బిసి కమిటీ కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, మండల బిసి సెల్ పార్టీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, తెలు గుదేశం పార్టీ బిసి విభాగం నాయకులు, కార్యకర్తలు తప్పకుండా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తులసీధర్ నాయు డు, మదనపల్లి నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షులు ముసలికుంట నాగయ్య, బిసి నాయకులు చల్లా నరసింహులు, కదిరి రాజ్ కుమార్ పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంక్ మాజీ మేనేజర్ చేతివాటం

-కేసు నమోదు చేసిన పోలీసులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల కేంద్రమైన బి.కొత్తకోటలో ఇండియన్ బ్యాంక్ మేనేజర్‌గా గతంలో పనిచేసిన జయరాములు నాయక్ అవినీతిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ప్రస్తుత మేనేజర్ హరిదాస్ గుప్తా పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు.బి.కొత్తకోట ఎస్.ఐ.రామ్మోహన్ కథనం మేరకు వివరాలు.గతంలో చాలా మంది రైతులు ఇండియన్ బ్యాంకులో వ్యవసాయ రుణాలు తీసుకోవడం జరిగిందని, 2022 సంవత్సరంలో ప్రభుత్వం రైతులు రుణాలు చెల్లించేందుకు వన్ టైం సెటిల్మెంట్ (ఓటిఎస్) అవకాశం కల్పించిందన్నారు.దీంతో ఓటిఎస్ ద్వారా వ్యవసాయ రుణాలు బ్యాంకుకు చెల్లిస్తే తమపై భారం తగ్గుతుందనే ఉద్దేశంతో రైతులంతా క్రాప్ లోన్లు చెల్లించారన్నారు. అప్పటి మేనేజర్ ఈ రుణాల్లో సుమారు రూ.40 నుంచి 50 లక్షల మొత్తాన్ని బ్యాంకుకు చెల్లించకుండా స్వాహా చేసినట్లు ప్రాథమికంగా అభియోగం నమోదయిందన్నారు. బ్యాంకు ఉన్నతాధికారులు అతని వద్ద నుంచి చాలా వరకు నగదు రికవరీ చేశారన్నారు. ఇంకా రూ.8.30 లక్షలు నగదు బ్యాంకుకు చెల్లించాలని ప్రస్తుత మేనేజర్ ఫిర్యాదులో పేర్కొన్నాడన్నారు. రైతులు రూ.50 వేలు పంట రుణం చెల్లించి ఉంటే అందులో రూ.15 వేలు మాత్రమే బ్యాంకుకు చెల్లించి మిగిలిన రూ.35,000 గత మేనేజర్ జయరాములు నాయక్ తన సొంత అవసరాలకు వినియోగించుకున్నాడన్నారు. మొత్తం 24 మంది రైతులు నగదును ఇలా స్వాహా చేయడం జరిగిందన్నారు. ప్రస్తుత మేనేజర్ ఫిర్యాదు మేరకు గత మేనేజర్ జయరాములు నాయక్ పై కేసు నమోదు చేశామన్నారు.ప్రస్తుతం అతను సస్పెన్షన్‌లో ఉన్నాడని,ప్రస్తుత మేనేజర్ ఫిర్యాదుపై విచారణ చేపట్టి గత మేనేజర్‌ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపుతామన్నారు.

వైసిపి పాలనలో కోతలు, బాదుడే : 'బత్యాల'

మాట్లాడుతున్న బత్యాల చంగల్‌రాయుడు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వైసిపి పాలనలో విద్యుత్ కోతలు, ఛార్జీల బాదుడు అధికమయ్యాయని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చందల్‌రాయుడు విమర్శించారు. శుక్రవారం సాక్షి పత్రిలో విద్యుత్ కోతలు లేవంటూ ప్రచురితమైన కథనానికి ఆయన స్పందిస్తూ శని వారం పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి, ప్రస్తుత తిక్క ముఖ్యమంత్రి జగన్ రెడ్డి చేతగాని తనం వల్ల రాష్ట్రంలో డిస్కంలు దివాలా తీశాయని పేర్కొన్నారు. జగన్ రెడ్డి పదవి చేపట్టినప్పటి నుంచి టారీఫ్‌ల కుదింపు, స్లాబుల మార్పు, ఫిక్స్‌డ్, అదనపు డిపాజిట్లు, అదనపులోడు ఎసిడిల పేర్లతో ఇప్పటివరకు రాష్ట్రంలో ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ఇటు ప్రజలు అటు రైతులు విద్యుత్ వినియోగదారులపై రూ.57.18 కోట్ల అదనపు భారం మోపి వారి నడ్డి విరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్నటువంటి 11 కెవి, 220 కెవి తదితర సబ్ స్టేషన్లకు వెళ్లి రికార్డులు పరిశీలించి, అక్కడ రికార్డుల్లో కోతలు విధించలేదని ఉంటే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ రెడ్డి దీనికి సిద్ధమేనా? అని సవాల్ విసిరారు. సైకో ముఖ్యమంత్రి కమీషన్ల కోసం కరెంటు కృత్రిమ సమస్య సృష్టిస్తూ బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారని విమర్శించారు. విద్యుత్ సంస్థలతో చేసుకున్న ఒప్పందాల ప్రకారం సోలార్ విండో పవర్ ను కొనుగోలు చేయకుండా కమీషన్ల కోసం బహిరంగ మార్కెట్లో యూనిట్‌ను రూ. 10 పైగా కొనుగోలు చేస్తూ రోజుకు రూ. 10 కోట్ల భారం వినియో గదారులపై మోపుతున్నారని ఆరోపించారు. థర్మల్ పవర్ స్టేషన్లో సామర్థ్యానికి తగ్గట్టుగా విద్యుత్తును ఉత్పత్తి చేయడం లేదన్నారు. ఎన్‌టిపిఎస్‌లో బ్రేక్ డౌన్ కారణంగా ఆరు యూనిట్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, కేవలం ఒక్క యూనిట్‌లో మాత్రమే ప్రస్తుతం ఉత్పత్తి జరుగుతుందని తెలిపారు. మొత్తం 1760 మెగావాట్లకు గాను ప్రస్తుతం కేవలం 500 యూనిట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారని తెలిపారు. ప్రతి వేసవి సీజన్లో సాంకేతిక కారణాలు చెప్పడం జగన్ చేతగానితనానికి నిదర్శనమని తెలిపారు. తన బినామీ కంపెనీలైన శిరిడి సాయి, హిందూజాలకు దోచి పెడుతూ విద్యుత్తు రంగాన్ని సర్వనాశనం చేశాడని ఆరోపించారు. తగినన్ని బొగ్గు నిలువలు ఉంచకుండా బహిరంగ మార్కెట్లో అధిక ధరల విద్యుత్తు కొనుగోలు చేస్తూ వినియోగదారుల నడ్డి విరుస్తూ వారిని కోలుకోలేకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం విచ్చలవిడిగా రాష్ట్రంలో విద్యుత్ కోతలు విధిస్తూ పైగా కోతలు లేని ఇస్తున్నామని తన పత్రికలో కథనాలు రాయడం విడ్డూరంగా ఉందని తెలిపారు. ఇలా తప్పుడు కథనాలు రాస్తే న్యాయ స్థానాన్ని ఆశ్రయించి చట్టపరమైన చర్యలు తీసుకునే విధంగా ముందుకు వెళ్తామని హెచ్చరించారు. వెంటనే తిక్క ముఖ్యమంత్రి జగన్ రెడ్డి తన సైకో పద్ధతి మార్చుకొని రాష్ట్ర ప్రజలకు, రైతులకు కోతలు లేని కరెంటును తక్కువ ధరలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వి పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని అవినీతి కోసం రైతుల మోటార్లకు బిగిస్తున్న మీటర్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా టిడిపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పదాధికారులు పాల్గొన్నారు.

టిబి వ్యాధిగ్రస్తులకు అండగా ఉందాం

పౌష్టికాహారాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

టిబి వ్యాధిగ్రస్తులు మందులతోపాటు సమతుల్యత ఆహారాన్ని తీసుకొంటే వ్యాధి తొందరగా నయమవుతుందని మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్ బాషా పేర్కొన్నారు. జిల్లాలో టీబీ చికిత్స పొందుతున్న వారికి బలవర్ధకమైన ఆహారాన్ని అందించేందుకు ని-క్షయ్ మిత్రగా దత్తత తీసుకోవడానికి ముందుకు రావాలని ప్రజలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు బాధ్యతగా మానవతా దృక్పథంతో ముందుకు రావాలన్నారు. శనివారం మదనపల్లె జిల్లా ఆసుపత్రిలో నిర్ధారిత టిబి రోగులకు వారి సమ్మతితో జిల్లా సహకారంతో పౌష్టిక ఆహార పదా ర్థాలను ఎమ్మెల్యే నవాజ్ బాషా, మెడికల్ సూపరింటెండెంట్, డాక్టర్లు, దాతలచే రోగులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో క్షయ వ్యాధి గ్రస్తులకు ప్రధానమంత్రి టిబి ముక్త భారత్ అబియాన్ నిక్షయ్ మిత్ర పథకం ద్వారా పౌష్టికాహారం సహాయం అందించటం కోసం కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అనేక విధాలుగా కృషి చేస్తున్నాయన్నారు. ఇందులో భాగంగా నిక్ష్యయ్ మిత్ర పథకం ప్రవేశ పెట్టిందని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి గ్రస్తులకు దాతల సహకారంతో పౌష్టిక ఆహారం అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఆసుపత్రి మదనపల్లె మదనపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే, వైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు, వార్డ్ కౌన్సిలర్లు, సభ్యులు కలిపి వందమంది, ఇతర దాతలు 50 మంది క్షయవ్యాధి గ్రస్థులను 6 నెలలపాటు దత్తత తీసుకున్నారని చెప్పారు. దత్తత తీసుకున్న దాతలను అభినందించారు. ఈ సందర్భంగా మెడికల్ సూప రింటెండెంట్, జిల్లా ఆసుపత్రి డాక్టర్లు పాల్ రవికుమార్, రామూర్తి నాయక్, ఆం జనేయులు, టిబి మెడికల్ ఆఫీసర్ శ్రీధర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి గ్రస్థులను ఆదుకోవడానికి ముందులకు వచ్చిన నాయకులకు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. మదనపల్లి టిబి యూనిట్ పరిధిలో సుమారు 150 మంది క్షయ వ్యాధి గ్రస్థులను దత్తత తీసుకొని 6 నెలల పాటు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్, టిబి విభాగం మదనపల్లి సిబ్బంది దయాలన్ ,ప్రభాకర్ ,సుశీల, వనజ కుమారి, జ్ఞాన తిలగం పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

చంద్రబాబుకు మతి భ్రమించింది

గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే 'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం పెద్ద ఎత్తున పట్టాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, పేదలకు అండగా నిలుస్తున్న సీఎం జగన్‌ను చూసి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఓర్వలేకపోతున్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని జర్రావారిపల్లి పంచాయతీ గెలసంవారిపల్లి, ఎర్రంరెడ్డిగారిపల్లి, మల్‌రెడ్డిగారిపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొని, పరిష్కార సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమరావతిలో 50వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలను కించపరిచేలా ప్రభుత్వం ఇచ్చే సెంటు భూమి శవం పూడ్చడానికి సరిపోతుందంటూ టిడిపి నేత చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిండమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ పాలన సాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్, తహశీల్దార్ ఫిరోజ్ ఖాన్, నాయకులు నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, చంద్ర, ఆనంద, రాయుడు, షాహెద్, రఘు పాల్గొన్నారు.

ఐఎఎల్ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

కడప : కేరళలోని త్రివేంద్రంలో జూన్ 1 ,2 ,3 ,4 తేదీలలో నిర్వహించబోయే భారత న్యాయవాదుల సంఘం ఐఎఎల్ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని భారత న్యాయవాదుల సంఘం కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సి .సుబ్రహ్మణ్యం వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి జి .విజయ మారుతి రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఉదయం కడప ఐఎఎల్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాల న్యాయవాదుల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్ అధ్యక్షత వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ మహాసభలకు ముఖ్య అతిథులుగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్ర చూడ్ ప్రారంభ ఉపన్యాసం చేయనున్నారని తెలిపారు. ఉపరాష్ట్రపతి కూడా సమావేశంలో పాల్గొని ప్రసంగిస్తారని వారు అన్నారు.

సిద్ధరామయ్య ప్రమాణ స్వీకారంలో నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కర్ణాటక రాజధాని, బెంగళూరు మహానగరం కంఠిరవ స్టేడియంలో కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య , మంత్రివర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి మదనపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు ఎస్.రెడ్డీ సాహెబ్,ఎస్.మహబూబ్ పీర్, తిరుపతి ఓబీసీ సెల్ చైర్మన్ చిరంజీవి ఇతర నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్.రెడ్డి సాహెబ్ మాట్లా డుతూ రెండోసారి కర్ణాటక ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. కర్ణాటకను ఆయన మరింత అభివృద్ధి చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఎపిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, టిపిసిసి అధ్యక్షులు రేవం త్‌రెడ్డిని కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో వచ్చే శాసనసభ ఎన్నికలలో ఎపిలోనూ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి శాయశక్తులా కృషి చేస్తామని స్పష్టం చేశారు.



ప్రమాణస్వీకారోత్సవానికి హాజరైన మనదపల్లె కాంగ్రెస్ నాయకులు

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తన అద్భుత నటనతో అభిమానుల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుని, వర్ధమాన తెలుగు సినీ హీరోల్లో ఒకరుగా ప్రసిద్ధిగాంచిన యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ (నందమూరి తారక రామారావు) జన్మదిన వేడుకలను శనివారం అన్నమయ్య జిల్లా, మదనపల్లి పట్టణం రవి, సునీల్, సాయిచిత్ర గ్రూప్ థియేటర్స్ ఎదురుగా మదనపల్లె ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాజేష్ (టెంపర్ రాజేష్) ఆధ్వర్యంలో కనీవిని ఎరుగని రీతిలో నిర్వహించారు. ఇందులో భాగంగా భారీ కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడంతో ఎన్టీఆర్ అభిమానులు స్వచ్ఛందంగా పెద్దఎత్తున రక్తదానం చేశారు. ఇందులో ప్రత్యేక ప్రతిభావంతుడైన అభిమాని చాంద్ బాషా రక్తదానం చేసి ఎన్టీఆర్‌పై తన అభిమానాన్ని చాటుకోవడం అందరిని ఆకర్షించింది. చిత్తూరు బస్టాండ్ సర్కిల్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ సినిమాల్లో తనదైన నటన ప్రదర్శనతో అభిమానుల్లో ఆయనకు ప్రత్యేక క్రేజ్ ఉందన్నారు. ఇందుకుగాను ఎన్టీఆర్‌ను యంగ్ టైగర్ అని పిలుస్తారన్నారు. రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలు, విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజలకు అండగా నిలబడి ఆపన్న హస్తం అందించడం ఆయన మంచితనానికి నిదర్శనమన్నారు. ఇటు నటన, అటు సేవా కార్యక్రమాలతో కోట్లాదిమంది ప్రజలు అభిమానాన్ని ఎన్టీఆర్ సొంతం చేసుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రవి రాజా, గణేష్, రెడ్డిరాజా (టెంపర్ రెడ్డి), ప్రభాకర్, వేణు గోపాల్, విష్ణువర్ధన్, నవీన్ కుమార్, నిఖిల్, ఎన్టీఆర్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపల్ రామనాథన్

విద్యార్థులు అవరోధాలను అధిగమించాలి

ప్రజాశక్తి-కురబలకోట

విద్యార్థులు అవరోధాలను అధిగమనించి లక్ష్య సాధన వైపు వెళ్ళాలని వైస్ ప్రిన్సిపాల్ రామనాథన్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. శనివారం మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్.రామనాథన్ మాట్లాడుతూ కళాశాలలో చదివే తమ విద్యార్థులు కళాశాలకు క్రమంగా హాజరు అవుతున్నారా, పరీక్షలో వారి పనితీరు ఎలా ఉందనే విషయాన్ని నెలకొకసారైన వచ్చి తెలుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మోటివేటర్ రామమూర్తి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఆసక్తితో చదవాలని అన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలపై ఉన్న మమకారంతో పాటు వారిని సరైన బాటలో నడిచేలా చూసుకోవాలని అన్నారు. చెడు వ్యసనాలకు బానిసై ఎంతో మంది వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఆత్మవిశ్వాసంతో అవరోధాలపై ఆధిపత్యం సాధించగలిగితే విజయం తథ్యమని అన్నారు. కార్యక్రమం లో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్, విభాగాధిపతి డాక్టర్ చొక్కనాథన్, డాక్టర్ కుసుమ పాల్గొన్నారు.

మహమ్మద్‌అలీ మృతదేహానికి నివాళి

ప్రజాశక్తి-పీలేరు

హత్యకు గురైన మహమ్మద్ అలీ మృతదేహానికి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి నివాళి అర్పించారు. శుక్రవారం పీలేరులో పోలీస్ స్టేషనుకు కూతవేటు దూరంలో ఓ దుండగుడు మహమ్మద్‌అలీ నిద్రిస్తుండగా బయటకు పిలిచి, కత్తితో పొడిచి హత్యచేసిన ఘటన పట్టణంలో కలకలం రేపింది. కిషోర్‌కుమార్‌రెడ్డి పట్టణంలోని బాలాజీనగర్‌కు చేరుకుని మొహమ్మద్‌అలీ మృతదేహానికి నివాళి అర్పించారు. మృతుడి పిల్లలను చూసి విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా నిచ్చారు. కిషోర్ కుమార్ రెడ్డితో పాటు పీలేరు టిడిపి నాయకులు శ్రీకాంత్ రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, రియాజ్, కార్యకర్తలు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు.

మైదానంలో ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల నిర్వహణకు సంబంధిత అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ పోటీలలో విజయాన్ని సాధించాలని ఉమ్మడి కడప జిల్లా జట్టు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రాక్టీస్ చేస్తున్నారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సిఇఒ ప్రసాద్, ప్రెసిడెంట్ రామసుబ్బారెడ్డి ఆర్గనైజింగ్ సెక్రటరీ రవీంద్రారాజు ఇలా ఆధ్వర్యంలో ఈ ప్రాక్టీస్ కొనసాగుతోంది. పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది క్రీడా మైదానాన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు.

మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకుంటున్న వరమని

ఉత్సాహంగా ఓపెన్ టు ఆల్ క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ అరవపల్లెలోని, నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నందలూరు ప్రీమియర్ లీగ్ ఏడవ సీజన్‌లో భాగంగా జరుగుతున్న ఓపెన్ టు ఆల్, హార్డ్ టెన్నిస్ క్రికెట్ బాల్ పోటీలు క్రీడాకారులను, క్రీడాభిమానులను ఉత్సాహాన్ని నింపుతున్నాయి. శనివారం ఉదయం ఎంఎస్‌లెవెన్ అరవపల్లి, సికిందర్ లెవెన్స్ నందలూరుల మధ్య జరిగిన మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠ భరితంగా కొనసాగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న ఎంఎస్ లెవెన్స్ జట్టు 14.5 ఓవర్లలో అన్ని వికెట్లను కోల్పోయి 107 పరుగులు చేసింది. ఇందులో హరీష్ 35 పరుగులు చేయగా, సికిందర్ జట్టు బౌలర్ అబ్బాస్ మూడు ఓవర్లలో ఐదు వికెట్లు పడగొట్టి, 19 పరుగులు ఇవ్వడం జరిగింది. అనంతరం 108 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన సికిందర్ జట్టు14.4 ఓవర్లలో 112 పరుగులు చేసి విజయం సాధించింది. ఇందులో అబ్బాస్ 26, జాఫర్ 25, ఆసిఫ్ 30, పరుగులు చేశారు. ఐదు వికెట్లను పడగొట్టడంతో పాటు 26 పరుగులు చేసిన అబ్బాస్ కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వరించింది. మధ్యాహ్నం ఇరానీ చాయ్ నందలూరు జట్టు నిర్ణీత 15 ఓవర్లలో ఏడు వికెట్లను కోల్పోయి 19 పరుగులు చేయగా, వెంకట రాజంపేట గోపి లెవెన్స్ జట్టు 13.4 ఓవర్లలో 8 వికెట్లను కోల్పోయి 110 పరుగులు చేసి గెలుపొందింది. 10 పరుగులకే ఐదు వికెట్లను కోల్పోయి ఆపదలో ఉన్న జట్టును గోపి లెవెన్స్ బ్యాట్స్మెన్ వరమని 27 బంతుల్లో 61 పరుగులు చేసి జట్టును విజయ తీరాలకు చేర్చడం తోపాటు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును విశ్రాంత విద్యుత్ అధికారి శ్రీరామ్ హరినాథ్, సీనియర్ క్రికెట్ ఆటగాళ్లు జంగం శెట్టి హరి ప్రసాద్, పసుపులేటి సునీల్ కుమార్ చేతుల మీదుగా ట్రోఫీని అందుకున్నాడు.

రచ్చకెక్కిన కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవి

ప్రజాశక్తి - పుల్లంపేట

రాష్ట్ర పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ ఆదేశాల మేరకు పుల్లంపేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా శిగమాల రమేష్ బాబుని ప్రకటించారని రైల్వే కోడూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి గోసాలదేవి, రాష్ట్ర ఎస్‌సిసెల్ కన్వీనర్ నల్ల కదిరిగాళ్ల శాంతయ్య పార్టీ కేంద్ర కార్యాలయంలో తెలిపారు. రైల్వే కోడూరు ఇన్‌ఛార్జి మాట్లాడుతూ ఎవరో గుర్తింపులేని సత్య నాయుడు అనే వ్యక్తి పుల్లంపేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడినని చెప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు సత్య నాయుడు అనే వ్యక్తి కనీసం పార్టీ జెండా ఏనాడైనా మోసాడా అని ప్రశ్నించారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ఇలాంటి చోటా నాయకులు పుట్టుకొచ్చారని పార్టీ కోసం మేము కార్యకర్తలని కలుపుకొని పోతుంటే కనీసం సొంత మండలంలో జెండా పట్టుకుని తిరగని నాయకులు కూడా మేం నాయకులం పెత్తనం చాలా ఇస్తాం అంటే కుదరదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శిగమాల రమేష్ కాదని సత్యనారాయణ మండల అధ్యక్షుడు ప్రకటించే అవకాశం లేదని తెలిపారు. 2024 సంవ త్సరంలో రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయ మన్నారు. కార్యక్రమంలో సిగమాల రమేష్, కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ కన్వీనర్ శాంతయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గోసాలదేవి

రైతులకు విజ్ఞాన కేంద్రాలు ఆర్‌బికెలు :'గడికోట'

ప్రజాశక్తి-రామాపురం

రైతులకు విజ్ఞాన కేంద్రాలుగా రైతు భరోసా కేంద్రాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని బండపల్లెలో వైఎస్‌ఆర్ రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో రైతుల ముంగిటకు ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను అందించేందుకు వీలుగా రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు. నాణ్యమైన విత్తనాలను, మందులను అందించడం జరుగుతొందన్నారు. అంతేకాక గ్రామాల్లో వ్యవసాయ అధికారులు, సిబ్బంది అందుబాటులో వుండి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలతోపాటు అవసరమైన ఇతర సేవలను అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి మండల కన్వీనర్ గడికోట జనార్దన్‌రెడ్డి, జడ్‌పిటిసి మాసన వెంకటరమణ, మాజీ రెస్కో చైర్మన్ కృష్ణారెడ్డి, మార్కెట్ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపిపి లు రవిశంకర్‌రెడ్డి, బాబు, సర్పంచ్ రవిశంకర్ రెడ్డి, మాజీ ఎంపిపి కదిరయ్య, సింగల్ విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి, మాజీ ఎంపిటిసి రమణ, సర్పంచ్ లు అయోధ్యాపురం నాగభూషన్ రెడ్డి, రామాంజులు, మునీర్, ఆంజనేయులు, రఘు, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, నాయకులు జనార్దన్‌రెడ్డి, ఎంపిటిసి చిన్న నరసింహులు, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరం వెంకట సుబ్బారెడ్డిలు పాల్గొన్నారు.

రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న డిఎల్‌డిఒ లక్ష్మీ పతి

ప్రజాశక్తి-కురబలకోట

హౌసింగ్ లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకోకపోతే ఇంటి పట్టాలను రద్దు చేసి వేరే వారికి ఇచ్చేస్తామని డివిజనల్ అభివృద్ధి అధికారి లక్ష్మీపతి అన్నారు. శనివారం మండలం గ్రామ సచివాలయంలో హౌసింగ్ అధికారులు లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు సొంతింటి కల సాకారం చేసుకోవాలని పభుత్వం ప్రతి పేదవాడికి ఇంటి పట్టాలు ఇచ్చి హౌసింగ్ కింద మంజూరు చేశారని అన్నారు. మండలంలో ఇంటి పట్టాల, స్థలాలు కేటాయించినా కూడా లబ్ధిదారులు ఇంటిని నిర్మించుకోక పోవడం సరికాదన్నారు. కంటేవారిపల్లి వద్ద ఉన్న జగనన్న లేఅవుట్‌లో వారంలో పునాదులు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులు హౌసింగ్ ఇల్లు నిర్మించుకునే వారికి ఉపాధి హామీ పథకం ద్వారా రూ.24 వేలు పొదుపు గ్రూపులో ఉన్న మహిళలకు రూ.35 వేల రూపాయలు లోను తోడ్పాటు ఇప్పించడం జరుగుతుందని లబ్ధిదారులకు తెలిపారు. జేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ దిలీప్‌కుమార్, హౌసింగ్ ఎఇ, ఉపాధి హామీసిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, సచివాల సిబ్బంది, వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో సంక్షేమ వెలుగులు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

వైసిపి ప్రభుత్వం అమలుచేస్తున్న నవరత్న పథకాల ద్వారా ప్రతి ఇల్లు సంక్షేమ వెలుగులతో నిండిందని, ప్రతి కుటుంబం సంతోషంతో ఉంటున్నారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శనివారం రాచవేటివారిపల్లి, వడ్డేపల్లి గ్రామాలలో స్థానిక సర్పంచ్ సుబ్రమణ్యం, ఎంపిపి నరసింహులు, సింగల్ విండో అధ్యక్షుడు రెడ్డిశేఖం రెడ్డి, వైసిపి మండల ఇన్‌ఛార్జి ఆర్.ఐ రమణారెడ్డి, ఆర్‌బికె చైర్మన్ ప్రవీణ్ కుమార్‌రెడ్డిలతో కలిసి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక నాయకులు, ప్రతి ఇంటికి వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వం ఆ కుటుంబానికి అందించిన సంక్షేమ ఫలాలను చదివి వినిపించారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని వారిని అడిగి తెలుసుకున్నారు. ఇంకా సమస్యలు ఏమన్నా ఉన్నాయా అంటూ ఆరా తీశారు. గ్రామంలో సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలు ఏర్పాటు, విద్యుత్తు లైన్‌ల మార్పులు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేయాలని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఎమ్మెల్యే స్పందిస్తూ స్థానికులు తెలిపిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధించిన అధికారులను ఆదేశించారు. పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి రెడ్డి వెంకటేష్, మండల సచివాలయాల కన్వీనర్ రామమోహన్‌రెడ్డి, రాజంపేట పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి కొమ్మేపల్లి శ్రీనివాసులురెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు మహమ్మద్‌రఫీ, సర్పంచులు చెంద్రాయుడు, మహదేవరెడ్డి, నాయకులు చక్రపాణిరెడ్డి, శశిధర్‌రెడ్డి, నవీన్, మాజీ సర్పంచ్ నాగరాజా, షావల్లి పాల్గొన్నారు.

ప్రజలకు సంక్షేమ పథకాలగురించి వివరిస్తున్న ఎమ్మెల్యే

సిసి రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, వైసిపి నాయకులు

రహదారుల నిర్మాణమే లక్ష్యం

ప్రజాశక్తి-చిన్నమండెం

గ్రామాలలో సుందరమైన రహదారులను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మల్లూరు, మోటకట్ల రోడ్డు నుంచి బంగారువాండ్లపల్లెకు రూ.5 లక్షల నిధులుతో పూర్తి చేసిన సిసిరోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని మల్లూరు–మోటకట్ల రోడ్డు నుండి బంగారు వాండ్లపల్లె కు రూ.5 లక్షల సిఎండిఎఫ్ నిధులుతో పూర్తి చేశామని తెలిపారు. మండలంలోని పలు గ్రామాల సమస్యలపై ఎమ్మెల్యే, జడ్‌పి మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డిలు ఆరా తీశారు. కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, ఉప సర్పంచులు పెద్ద రెడ్డెప్ప రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మాజీ సర్పంచ్ చక్రపాణి రెడ్డి, రహిమాన్ ఖాన్, డీలర్ రమణ, నియోజక వర్గ బిసి సెల్ కన్వీనర్ నాగరాజు యాదవ్, సంబేపల్లె మండల వ్యవసాయ సలహా సంఘ అధ్యక్షుడు వాసుదేవ రెడ్డి,పిఆర్‌జెఇ హర్ష వర్ధన్‌రెడ్డి, వైసిపి నాయకులు రామిరెడ్డి, చంద్రరెడ్డి, రమేష్‌రెడ్డి, మనోహర్ రెడ్డి, మునిరెడ్డి, ఆనంద రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రామాంజులు, వెంకట రమణ, చంద్ర, బాస్కర్, సాధిక్, సహదేవ నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-నందలూరు

దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని అన్నమయ్య, కడప ఉమ్మడి జిల్లాల ఎన్‌టిఆర్ అభిమాన సంఘం అధ్యక్షులు టి. లక్ష్మీనారాయణ, సీనియర్ అడ్వకేట్, ప్రముఖ కళాకారుడు ఎస్ కృష్ణ కుమార్‌లు కోరారు. మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ ఆరవపల్లి లోని ఆర్‌అండ్‌బి అతిథి గృహ ఆవరణలో శనివారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21 , 22వ తేదీలలో రాజంపేట పట్టణం, రెడ్డివారి వీధిలోని జిఎంసి కళామందిర్‌లో కుల, మత, పార్టీలకతీతంగా ఈ ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఎన్టీఆర్ పాటలు, పద్యాలు, ఏక పాత్రాభినయాలు, హాస్య వల్లరి, కూచిపూడి, భరతనాట్యం, అన్నమయ్య నాటకంలోని చివరి ఘట్టం, పౌరాణిక ఏకాంకిక ఘట్టములు తో పాటు వివిధ రకాల కార్య క్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమాలలో పాల్గొను వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన వారికి ఎన్టీఆర్ పురస్కారము, ఎన్టీఆర్ జీవిత సాఫల్య పురస్కారములు బహుకరించడం జరుగుతుందని అన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నందలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు దాసరి నర్సింహులు, విశ్రాంత రైల్వే ఉద్యోగి చామంచి పెంచలయ్య, లయన్స్, వాకర్స్ క్లబ్ కార్యదర్శి మోడపోతుల రాము, టిడిపి నాయకులు కానకుర్తి వెంకటయ్య, విశ్రాంత అధికారి పోతురాజు ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల కేంద్రం లక్కిరెడ్డిపల్లి లోని ఎపిమోడల్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రవేశం కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రేఖ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపిసి, బైపిసి , సిఇసి, ఎంఇసి కోర్సుల్లో ప్రవేశం కొరకు అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 22వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని పూర్తి చేసిన దరఖాస్తులు కళాశాలలో అప్పగించాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలు రూ.150, ఒసి, బిసి, ఇడబ్ల్యుసి విద్యార్థులు రూ.200లు నిర్ణీత రుసుముతో చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యా ర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. పదిలో మార్కులు ఆధారంగా ఇంటర్మీడియట్‌లో ప్రవేశం ఉంటుందని ఆమె తెలిపారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను రా ఎన్‌టిఆర్ ట్రస్టు జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు అలియాస్ ఎన్‌టిఆర్ శీనా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌టిఆర్‌ను ఆదర్శంగా తీసుకొని, భవిష్యత్తులో మరిన్నీ సేవా కార్యక్రమాలను చేపడు తామన్నారు. ఎన్టీఆర్ నిండునూరేళ్ల ఆయు రారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మోహన్ రెడ్డి, భార్గవ్, రాజేష్, చిట్టీ, సైదు తదితరులు పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ కొవ్వొత్తుల సంస్మరణ దినోత్సవం

ప్రజాశక్తి - కడప అర్బన్

అంతర్జాతీయ కొవ్వొత్తుల సంస్మరణ దినోత్సవం ఆదివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య అదనపు అధికారి డాక్టర్ ఖాదరవల్లి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 6:30 గంటలకు జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయం నుంచి కొవ్వొత్తుల ర్యాలీ ప్రారంభమై ఐటిఐ సరుకులకు చేరుకుంటుందని తెలిపారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికారులు, నెట్వర్క్ ప్రతినిధులు పాల్గొనాలని పేర్కొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని జమ్మలమడుగు నగర పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా పేర్కొన్నారు. శనివారం ఉదయం పట్టణంలోని మాస్టర్ పాయింట్‌లో రెడ్యూస్ రియూస్ రీసైక్లింగ్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు విరివిగా మొక్కలను పెంచాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీలు, మెప్మా సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

చిన్నారులందరికీ ఆధార్ తప్పనిసరి

కలసపాడు : మండలంలోని అంగన్వాడీ కేంద్రంలో ఉన్న 0 నుంచి 6 సంవత్సరాల లోపు చిన్నారి పిల్లలందరికీ ఆధార్ తప్పనిసరి అని అంగన్వాడీ సూపర్‌వైజర్ రత్నకుమారి పేర్కొన్నారు. శనివారం పిడుగుపల్లె అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన అంగన్వాడీ కార్యకర్తల సమావేశంలో ఆమె హాజరై మాట్లాడారు. సంవత్సరంలోపు పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాన్ని ఆయా హాస్పిటల్ నుంచి పొందిన తర్వాత సచివాలయ ఆధార్ కేంద్రాలలో నమోదు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆందోళనలు జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శనివారం సంగం జిల్లా కార్యాలయంలో ఆందోళన కార్యక్రమాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమేష్ కుమార్ సుదర్శన్ రెడ్డి రాష్ట్ర కార్యదర్శి రఘురామ నాయుడు మాట్లాడుతూ ఈ నెల 22న ప్రొద్దుటూరు, 23న సిద్ధవటం, 25న పులివెందుల, 26న బద్వేలు, 27న జమ్మలమడుగు, 29న కమలాపురం, 31న కడప లో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు పాల్గొన్నారు.౦౦

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

లోవోల్టేజీ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-కలకడ

ఎట్టకేలకు లోవోల్టేజి సమస్యను ట్రాన్స్‌కో ఎఇ వరప్రసాద్‌ను సత్వరమే స్పందించి పరిష్కరించారు. మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ ఎర్రయ్య గారిపల్లి సమీపంలోని దేవళంపేట గ్రామస్తులు శుక్రవారం లోవోల్టేజి కారణంగా ఇళ్లలోని ఎలక్ట్రానిక్ పరికాలను కాలిపోతున్నాయని ట్రాన్స్‌కో కార్యాలయాన్ని ముట్టడించారు. ట్రాన్స్‌కో కార్యాలయం ముట్టడి అనే శీర్షికతో శుక్రవారం ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన ట్రాన్స్‌కో ఎఇ వరప్రసాద్ తన సిబ్బందితో హుటాహుటిన గ్రామానికి వెళ్లిలోవోల్టేజి ఉన్న విషయం గుర్తించి, గ్రామ సమీపంలో నూతనంగా రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి గ్రామస్తులకు విద్యుత్తుతో ఉన్న సమస్యలను పరిష్కరించారు. ప్రజాశక్తి దినపత్రికలో వార్త వచ్చిన 24 గంటలు గడవకముందే ఎఇ స్పందించి లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించడంపై గ్రామ ప్రజలు తమ హర్షం వ్యక్తం చేశారు. సమస్య మరల ఉత్పన్నం కాకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని గ్రామ ప్రజలు ఎఇని కొనియాడారు.

తాగునీటి పంపును ప్రారంభించిన సర్పంచ్

నగరిలో తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-పీలేరు

మండల పరిధిలోని వేపులబైలు పంచాయితీ, నగరిలో తాగు నీటి సమస్య పరిష్కారమైంది. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రరెడ్డి సహకారంతో శనివారం తాగునీటి సమస్య పరిష్కరించడం జరిగింది. కార్యక్రమంలో వేపులబైలు పంచాయితీ సర్పంచ్ పి.చెంగలరాయుడు, ఉప సర్పంచ్ విపి పవన్ కుమార్ రెడ్డి, వైసిపి నాయకులు విపి రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆటో, కారు ఢీ - బాలిక మృతి

-ఐదుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-పీలేరు

మృతి చెందిన యువచైత్ర

దైవ దర్శనం కోసం ఓ కుటుంబం ప్రయాణిస్తున్న కారు, ఎదురుగా దైవ కార్యంలో పాల్గొనడానికి వెళుతున్న మరో కుటుంబానికి చెందిన ఆటోను ఢీకొన్న ఘటన ఒకరు మృతి చెందగా ఐదుగురు గాయపడిన సంఘటన మండ లంలో చోటు చేసుకుంది. పీలేరు–రాయచోటి జాతీయ రహదారిపై శనివారం జరిగిన ఘటనా వివరాలు పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తాడి పత్రి నుంచి ఓ కుటుంబం కాణిపాక వరసిద్ధి వినాయకుని దర్శనం కోసం కారులో బయలుదేరి వచ్చింది. ఆ కారు పీలేరు మండలం, ముడుపులవేముల పంచా యితీ, కృష్ణారెడ్డిగారిపల్లి బస్ స్టాపుకు కొద్ది దూరంలో ఎదురుగా తిరుపతి నుంచి వస్తున్న ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలో వస్తున్న కలకడ మండలం, కోట గుడిబండకు చెందిన గండికోట రామలక్ష్మి(53), ఆమె కుమారుడైన ఆంజ నేయులు(34), కోడలు జ్యోతి(27), మనుమరాళ్లు యువచైత్ర(8), గుణ సాత్విక(6), కోన గ్రామానికి చెందిన శివకృష్ణ కుమార్తె జ్ఞానశ్రీ(9) తమ స్వగ్రామం లోని బంధువుల ఇంట్లో జరుగుతున్న దైవ కార్యంలో పాల్గొనడానికి వస్తూ ప్రమా దానికి గురయ్యారు. ఈ దుర్ఘటనలో యువ చైత్ర(8) మృతి చెందగా మిగిలిన కుటుంబ సభ్యులు తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రమాద సమాచారం తెలుసు కున్న పీలేరు పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను, మృత దేహాన్ని పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. బాధితులను ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతికి పంపారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. పీలేరు ఎస్‌ఐ నరసిం హుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి పూరిగుడిసె దగ్ధం

ప్రజాశక్తి-చిట్వేలి

మండలపరిధిలో నాగవరం గ్రామం వడ్డిపల్లిలోని కె.ప్రమీల ఇంటిలో గ్యాస్ సిలిండర్ పేలి పూరి గుడిసె పూర్తిగా కాలి ధ్వంసమైంది. ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేక పోవడంతో ప్రాణపాయం తప్పింది. మంటల్లో జత బుట్టకమ్మలు, వాషింగ్ మిషన్, రూ.5వేలు నగదు, దుస్తులు, బిరువా, నీటి మోటారు అగ్నికి కాలిపోయామని ప్రవీల ఆవేదన వ్యక్తం చేసింది. సుమారు ఐదు లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

టమోట కట్టెలు, పివిసి పైపులకు నిప్ప

-పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మా ప్రక్క పొలానికి చెందిన వారు దౌర్జన్యంగా టమోటా పంటకు వినియోగించే కట్టెలు, పివిసి పైపులను దగ్ధం చేశారని మండలంలోని జనుపువారి పల్లికి చెందిన రైతు ముద్దసాని సుధాకర్ ఆయన సతీమణి అంజమ్మలు శనివారం బి.కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి కథనం మేరకు వివరాలు మా పూర్వీకుల నుండి సర్వే నంబర్ 2161లో 4.97 ఎకరాలు, సర్వే నంబర్ 2142లో 4.55 ఎకరాలు భూమి సంక్రమించిందన్నారు.మేము ఈ భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. మా భూమికి పక్కనే ఉన్న పూల ఆదినారాయణ, రావిల్లి త్యాగరాజులు పొలం ఉందన్నారు. వారు పాత కక్షలు మనసులో పెట్టుకొని,దౌర్జన్యంగా మా పొలంలోని రూ.1,20,000 వేలు విలువచేసే 6 వేలు టమోటా పంటకు వినియోగించే కట్టెలు,పివిసి పైపులను దగ్ధం చేశారన్నారు.దీనిని అడ్డుకోబోయిన మాపైన త్యాగరాజు అనే వ్యక్తి రాళ్లదాడి చేశారన్నారు. తాము దిక్కుతోచక అతని మొబైల్ ఫోన్ లాక్కొని పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమకు నష్టం కలిగించిన వారిని కఠినంగా శిక్షించి, వారి వద్ద నుండే తమకు నష్టపరిహారం అందేవిధంగా చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేయగా,హెడ్ కానిస్టేబుల్ రవీంద్రనాయక్ సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

నీటి కుంటలో పడి బాలిక దుర్మరణం

ప్రజాశక్తి -రాయచోటి టౌన్



మృతి చెందిన షేక్ సల్మా

స్థానిక పట్టణంలోని రాయుడు కాలనీకి చెందిన షేక్ సల్మా (16) అనే బాలిక కంచలమ్మ గండిలో పడి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాయుడు కాలనీకి చెందిన మహబూబ్‌బాషా, షేక్ యస్మీన్ దంపతులకు ఐదు కుమార్తెలు, ఇద్దరు కుమారుడు ఉన్నారు. సల్మా ఐదవ కుమార్తె కుటుంబ సభ్యులతో కలిసి శనివారం కంచాలమ్మ గండికు చూడడానికి వెళ్లగా అక్కడే ఉన్న కుంటలోకి దిగింది. ఆడుకుంటూ ఉండగా ప్రమాదవశాత్తు నీటిలో దిగి ఆడుకుంటూ ముందుకు వెళ్ళి లోతు ఎక్కువ ఉండడంతో కేకలు వేయగా అక్కడే ఉన్న తల్లి కొడుకుకు బయటకి లాగగా సల్మా మృతి చెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరసింహారెడ్డి తెలిపారు.